జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php




సంపుటి 16 సంచిక 102 విశాఖపట్నం | మంగళవారం 05 డిసెంబరు 2023 | 8 పేజీలు | వెల : 5.00

# ఏపీ కోస్తాలో కడలి కల్లోలం..

## గజగజ వణకుతున్న తీరప్రాంతాలు
## మైచాంగ్ పడగలో కోస్తా బిక్కు బిక్కు
## హోరు గాలి భారీ వర్షం
## బందరు, కాకినాడ మధ్య తుపాను తిష్ట
## చినగొల్లపాలెంలో తీరం దాటే చాన్స్
## తమిళనాడు అప్రమత్తం.. స్కూళ్లకు సెలవు
## ఎయిర్‌పోర్టులోనే ఆగిపోయిన విమానాలు




అమరావతి: ఆంధ్రప్రదేశ్ తీరంపై మైచాంగ్ పడగ విప్పింది. కడలి కోరలతో దూసుకువస్తోంది. ఇటు కుంభవృష్టి, మరో వైపు విపరీత చలిలో తీరప్రాంతం గజ గజలాడుతోంది. 100 కిలోమీటర్ల వేగంతో హోరు గాలి వీస్తుంటే, అలలు విరుచుకు పడుతున్నాయి. మూడు రోజుల ముందే అధికారులు అప్రమత్తం అయ్యారు. తీరప్రాంతంలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, - విజయవాడ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఉరుములు.. మెరుపులతో జడివాన అల్లాడిస్తోంది. ఈ జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్?ని వాతావరణ శాఖ ప్రకటించింది. పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో తెల్లవారుజామున 3.00 గంటల నుంచి భారీ వాన ప్రారంభమైంది. ఇక.. అటు తమిళనాడులోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలకు ప్రభుత్వం సెలవులిచ్చింది. వాన దాటికి విమానరాకపోకలకు అంతరాయం కలిగింది. మద్రాస్? ఎయిర్?పోర్టులోనే విమానాలన్నీ నిలిచిపోయాయి.

**కృష్ణాజిల్లాలో కల్లోలం**

సోమవారం తెల్లవారుజాము నుంచే కృష్ణా జిల్లా వ్యాప్తంగాభారీ వర్షం కురుస్తుంది. తీరం వెంబడి గంటకు 55నుంచి - 75కిలోమీటర్ల వేగంతో హోరు గాలి వీస్తోంది.కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం చిన్న గొల్లపాలెంలో మంగళవారం మధ్యాహ్నం తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తుపాన్ విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. తుపాను సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్త మయ్యాయి, . సముద్రంలో అల్లకల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. అలల ఉధృతి ఎక్కువగా కనిపిస్తోంది. సముద్రం కొన్ని ప్రాంతాల్లో ముందుకు వచ్చింది . కృష్ణాజిల్లా తీర ప్రాంతంలోపది మీటర్ల ఎత్తున సముద్ర పు అలలు ఎగిసిపడుతున్నాయి. (మిగతా 2లో..)

## ఉద్యోగులు బాగుంటేనే..
# ప్రజలూ బాగుంటారు: జగన్



తాడేపల్లి : ప్రభుత్వం నుంచి జరగాల్సిన మంచి ఏదైనా ఉద్యోగులకు చేస్తాం. ఉద్యోగులు అనేవారు ప్రభుత్వంలో భాగస్వాములు. ఉద్యోగులు బాగుంటేనే ప్రజలు బాగుం టారని విశ్వసించిన ప్రభుత్వం మనది. మీ మనసులో కష్టం ఉండకుండా చూడాలన్నదే మా ఉద్దేశం అని సీఎం పేర్కొన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు శుక్రవారం కలిశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, జీపీఎస్ ప్రకటించడం పై హర్షం వ్యక్తం చేస్తూ.. సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వంలో ఏపీవీవీపీ ఉద్యోగుల విలీనం, పీఆర్సీ కమిషన్ఏర్పాటు సహా రాష్ట్ర కేబినెట్, ఉద్యోగుల విషయంలో తీసుకున్న నిర్ణయాలపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సిఎం మాట్లాడుతూ, "అందుకే పెన్షన్సహా కొన్ని పరిష్కారాల కోసం రెండేళ్లుగా తపనపడ్డాం. గతంలో ఎవ్వరూ కూడా ఈ సమస్యలకు పరిష్కారం చూపించడానికి తపనపడ్డ సందర్భాలు లేవు. (మిగతా 2లో..)

# 11న జగన్ కేబినెట్ భేటి



అమరావతి: ఈ నెల 11న సీఎం జగన్ అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరగనుంది. వెలగపూడి సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో ఈ కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ మేరకు సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి తెలిపారు.కేబినెట్‌లో చర్చించాల్సిన అంశాలపై ప్రతిపాదనలను ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోగా పంపాలని అన్ని శాఖలను సీఎస్ డా.కేఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. విశాఖ నుంచి పరిపాలన, నవరత్నాల పథకాల అమలుకు ఆమోదం సహా పలు అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. మరోవైపు ఉపాధ్యాయ నియామకాల కోసం డీఎస్సీ నోటిఫికేషన్ వంటి అంశాలపై సీఎం జగన్ కేబినెట్‌లో చర్చించనున్నారు.

# దూసుకొస్తున్న తుఫాన్

## 151 రైళ్లు రద్దు




హైదరాబాద్ : మిచాంగ్ తుఫాన్ తీరం వైపు దూసుకొస్తోంది.. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణపై కూడా దీని ప్రభావం స్పష్టంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.. ఇప్పటికే ఏపీలో పలు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.. దీంతో రెండు రోజుల పాటు ముందు జాగ్రత్తగా దక్షిణ మధ్య రైల్వే ఏకంగా 151 రైళ్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది.. ముఖ్యంగా విజయవాడ - చెన్నై మార్గంలోని రైళ్లను రద్దు చేశారు.. అలాగే కాజీపేట మీదుగా విశాఖకు వెళ్లే కొన్ని రైళ్లను రద్దు చేయడంతో పాటు మరికొన్ని రైళ్లను లిమిటెడ్ హాల్ట్ గా నడపనున్నారు. ఇతర వివరాలకు ఇండియన్ రైల్వే వెబ్ సైట్ లో చూడాలని సూచించింది..


# సనాతన ధర్మంపై వ్యాఖ్యలను వక్రీకరించారు : ఉదయనిధి స్టాలిన్




చెన్నై : సనాతన ధర్మంపై తన వ్యాఖ్యలను బీజేపీ వక్రీకరించిందని డీఎంకే నేత, తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. కరూర్ జిల్లాలో జరిగిన యువ కార్యకర్తల భేటీలో ఉదయనిధి మాట్లాడుతూ గతంలో సనాతన ధర్మంపై తాను చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు.మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ గతంలో తాను సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలను తప్పుగా చిత్రీకరించారని ఆరోపించారు. తాను ఊచకోతకు పిలుపు ఇచ్చానని, తాను అనని మాటలను ప్రధాని తనకు ఆపాదించారని స్టాలిన్ ఆరోపించారు. తాను ఓ సదస్సుకు హాజరై కొద్ది నిమిషాలు మాట్లాడానని, ఎవరిపట్ల వివక్ష చూపకుండా అందరినీ సమానంగా చూడాలని తాను కోరానని గుర్తుచేశారు. అయితే తాను చేసిన వ్యాఖ్యలను కాషాయ నేతలు వక్రీకరించి యావత్ దేశం తన గురించి మాట్లాడుకునేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ స్వామీజీ తన తలపై రూ. 5-10 కోట్లు వెలకట్టారని అన్నారు. ప్రస్తుతం ఈ కేసు న్యాయస్థానం పరిధిలో ఉందని, న్యాయస్థానాల పట్ల తనకు విశ్వాసం ఉందని చెప్పారు. తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని కోరారని, కానీ తాను క్షమాపణ చెప్పేదిలేదని స్పష్టం చేశానన్నారు. తాను స్టాలిన్ కొడుకునని, కలైంజ్ఞర్ మనవడినని, తాను వారి భావజాలాన్ని మాత్రమే సమర్థిస్తున్నానని చెప్పాను.

# మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన హింస..

## తెగల మధ్య ఘర్షణలో 13 మంది మృతి



న్యూఢిల్లీ: మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. టెంగ్‌నౌపాల్ జిల్లా సైబాల్ సమీపంలోని లీతూ గ్రామంలో రెండు తెగలకు చెందిన జనం మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఒకరినొకరు కర్రలు, రాళ్లతో కొట్టుకున్నారు. తుపాకులతో కాల్చుకున్నారు. ఈ ఘర్షణల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఘర్షణలు జరుగుతున్నట్లు సమాచారం అందగానే తాము ఘటనా ప్రాంతానికి వెళ్లామని, అప్పటికే అక్కడ 13 మృతదేహాలు పడి ఉన్నాయని భద్రతాధికారులు తెలిపారు.అయితే, ఈ ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారు లీతూ గ్రామానికి చెందిన వారు కాదని అధికారులు ప్రాథమిక విచారణలో తేలింది. వేరే ప్రాంతం నుంచి వచ్చిన ఈ గ్రూప్.. గ్రామంలోని మరో తెగకు చెందిన గ్రూప్‌తో ఘర్షణకు దిగిందని భద్రతాధికారులు చెప్తున్నారు. స్థానికులు కాకపోవడంతో మరణించిన 13 మంది ఎవరనేది ఇంకా గుర్తించలేదు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.కాగా, ఈ ఏడాది మే 3న మణిపూర్‌లోని మైతీ, కూకీ తెగల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణలు కొన్ని నెలలపాటు కొనసాగాయి. ఈ హింసాత్మక ఘటనల్లో మొత్తం 182 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 50 వేల మంది నివాసాలను కోల్పోయారు. ఈ ఘర్షణల కట్టడి కోసం ఆ రాష్ట్రంలో భారీగా బలగాలను మోహరించారు. ఇంటర్నెట్ సేవలపై కూడా నిషేధం విధించారు. ఇటీవలే పరిస్థితి అదుపులోకి రావడంతో ఆదివారమే ఇంటర్నెట్ సేవలను తిరిగి పునరుద్ధరించారు. ఇంతలోనే మళ్లి తెగల నడుమ ఘర్షణలు చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది.



## ఉద్యోగులు బాగుంటేనే..

# ప్రజలూ బాగుంటారు: జగన్

**(మొదటిపేజీ తరువాయి)**ఉద్యోగులకు పరిష్కారం దొరకాలి, అంతేకాకుండా భావితరాలను కూడా దష్టిలో ఉంచుకోవాలి. దీన్ని దష్టిలో ఉంచుకుని జీపీఎస్ను తీసుకువచ్చాం. రిటైర్డ్ ఉద్యోగుల జీవన ప్రమాణాలను కూడా నిలబెట్టేదిగా జీపీఎస్‌ను రూపొందించాం. 62 ఏళ్లకు రిటైర్ అయితే 82 ఏళ్లలో కూడా అదే స్థాయిలో జీవన ప్రమాణాలు ఉండాలి. అందుకే ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని డీఆర్లు ఇచ్చేలా జీపీఎస్‌లో పొందుపరిచాం" అని చెప్పారు. ఉద్యోగుల విషయంలో రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను 60 రోజుల్లోగా అమలు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

## అప్రమత్తంగా ఉండండి..ఆసరాగా నిలవండి.. నారా లోకేష్

అమరావతి: ఏపీకి మిచౌంగ్ తుఫాన్ ముప్పు పొంచి ఉందని విపత్తుల సంస్థ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, సహాయకచర్యల్లో టిడిపి నేతలు-కార్యకర్తలు పాల్గొనాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మిచౌంగ్ తుఫాన్ తీవ్రత దృష్ట్యా యువగళం పాదయాత్రకి విరామం ప్రకటించానని తెలిపారు. విపత్తుల సంస్థ జారీ చేసే హెచ్చరికలు ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తూ జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సురక్షిత ప్రదేశాలలో ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో బయటకు రావొద్దని కోరారు. అత్యవసర పరిస్థితులలో ఉపయోగపడేలా మొబైల్ ఫోన్లు చార్జింగ్ ఉంచుకోవాలని, శిథిల భవనాలలో అస్సలు ఉండొద్దని హెచ్చరించారు. టిడిపి కేడర్ స్వచ్ఛందంగా తుఫాన్ సహాయక చర్యలు చేపట్టాలని, ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# రాజస్థాన్‌లో 30 ఏళ్ల ఆనవాయితీయే..

జైపూర్, డిసెంబర్ 4, :రాజస్తాన్ విషయానికొస్తే ఇక్కడ గడిచిన 30 ఏళ్లుగా అట్టు తిరగేసినట్లు ప్రజలు తీర్పు ఇస్తున్నారు. అంటే ఐదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటే మరో ఐదు సంవత్సరాలు బీజేపీ అధికారంలోకి వస్తుంది. ఇలాంటి రాజకీయాలు తమిళనాడులో చూడొచ్చు. ఐదేళ్లకంటే ఎక్కువ కాలం ఏ పార్టీ అధికారంలో కొనసాగే పరిస్థితి లేదు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉంది. అశోక్ గెహ్లాట్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ఈ ఐదేళ్ల కాలంలో తాము ప్రవేశపెట్టిన సంక్షేమమే తమను గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే ముప్పైఏళ్ల ఆనవాయితీకి గండికొట్టి మరోసారి కాంగ్రెస్ వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారని చెప్పారు.కానీ వీటన్నింటికీ తెరదించుతూ ప్రజలు బీజేపీకే పట్టం గట్టినట్లు తెలుస్తోంది. ఉదయం కౌంటింగ్ ప్రారంభమైన మొదటి రౌండు మినహా కాంగ్రెస్ ఎక్కడా ఆధిక్యంలో కనిపించడం లేదు. ఇప్పటికీ బీజేపీ 114 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. కాంగ్రెస్ 71 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఇతరులు కూడా తమ ప్రాభవాన్ని చూపిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ విజయం ఖాయంగా



కనిపిస్తోంది. దాదాపు అన్ని రౌండ్లు పూర్తైనట్లు కనిపిస్తోంది. మిగిలిన రౌండ్లలో కాంగ్రెస్ ఆధిపత్యం చేపించినప్పటికీ పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చు అని విశ్లేషకులు భావిస్తున్నారు.బీజేపీకి విజయం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఒకవేళ ప్రస్తుతం ఉన్న ఆధిక్యంలో నుంచి బీజేపీ కొంత తగ్గినా మ్యాజిక్ ఫిగర్ 101 ఎప్పుడో దాటేసింది. దీంతో బీజేపీ శ్రేణుల్లో తమ గెలుపుపై ఎలాంటి భయంలేకుండా సంబరాలు చేసుకుంటున్నారు. పలువురు కేంద్ర మంత్రులు కూడా స్పందిస్తూ మోదీ హవా రాజస్తాన్‌లో కొనసాగుతుందని చెప్పారు. ఒకవేళ అంతటి క్లిష్టమైన పరిస్థితులే తలెత్తితే ఇతరుల నుంచి గెలిచిన ఇండిపెండెంట్లను తమ పార్టీలోకి ఆహ్వానించి ప్రభుత్వాన్ని సులభంగా ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా ఐదు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మూడు రాష్ట్రాల్లో తన ఆధిపత్యాన్ని నిలుపుకోగలిగింది. దీని ప్రభావం రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఖచ్చితంగా పడుతుందని చెప్పక తప్పదు.

**రాజస్థాన్ సీఎం రేసులో జైపూర్ యువరాణి**

మొత్తం 199 స్థానాలకు ఎన్నికలు జరగ్గా 115 స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. కాంగ్రెస్ కేవలం 67 స్థానాలకే పరిమితమైంది. ఇక రాజస్థాన్‌లోని విద్యాధర్ నగర్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ అభ్యర్థి, రాజ్‌సమంద్ పార్లమెంటు సభ్యురాలు దియా కుమారి ఘన విజయం సాధించారు. ఆమె తన ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి సీతారాం అగర్వాల్‌పై ఏకంగా 71,368 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ సందర్భంగా మాట్లాడిన దియా కుమారి రాజస్థాన్‌తో సహా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ విజయానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజనే కారణమన్నారు. 'మోదీ మాయాజాలం' ఈ రాష్ట్రాల్లో బాగా ప్రతిధ్వనించిందని, కాషాయ పార్టీని అధికారం వైపు మళ్లించిందని ఆమె ఉద్ఘాటించారు. 'ఈ విజయం క్రెడిట్ ప్రధాని మోడీ, అమిత్ షా జీ, ఏఖ నడ్డా జీ, రాష్ట్ర నాయకులు, పార్టీ కార్యకర్తలందరికీ చెందుతుంది. రాజస్థాన్‌తో పాటు ఛత్తీస్‌గఢ్‌లో కూడా మోడీ జీ మ్యాజిక్ బాగా పనిచేసింది. రాష్ట్రంలో సుపరిపాలన, అభివృద్ధిని అందిస్తాం.. రాష్ట్రంలో ఇప్పుడు శాంతిభద్రతలు కనిపిస్తాయి. సీఎం ఎవరనేది పార్టీ అగ్రనాయకత్వం నిర్ణయిస్తుంది' అని దియా కుమారి తెలిపారు.రాజస్థాన్ ముఖ్యమంత్రి రేసులో మాజీ సీఎం వసుంధర రాజేతో పాట జైపూర్ రాజకుటుంబానికి చెందిన దియా కుమారి పేరు కూడా బాగా వినిపిస్తోంది. జైపూర్‌ను పాలించిన ఆఖరి మహరాజు మాన్ సింగ్ ఎఎ మనవరాలైన దియాకుమారి ఢిల్లీ, ముంబై, జైపూర్‌లో విద్యాభ్యాసం చేశారు. లండన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో ఆమె ఫైన్ ఆర్ట్స్ చదివారు. గ్రాడ్యుయేట్ డిప్లొమా పూర్తి చేశారు. ఫిలాసఫీలో ఆమె డాక్టరేట్ అందుకున్నారు. 2013లో బీజేపీలో చేరిన దియా కుమారి.. అదే ఏడాది సవాయ్ మాధోపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2019 సాధారణ ఎన్నికల్లో రాజ్సామండ్ నుంచి ఎంపీగా పోటీచేసిన దియాకుమారి సుమారు ఐదున్నర లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఇప్పుడు ఎంపీగా కొనసాగుతూనే అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. ఘన విజయం సాధించి ఏకంగా ముఖ్యమంత్రి రేసులో నిలిచారు.

# ఏపీ కోస్తాలో కడలి కల్లోలం..

(మొదటిపేజీ తరువాయి)

దివిసీమలో కోడూరు, నాగాయలంక మండలాల్లో నిఉంటగుణం, రామకృష్ణ పురం, పాలకాయతిప్ప, బసన్నపాలెం ,ఇరాలి, చింతకోళ్ళ ,ఎదురు మెండి, ఎల్లిచెట్లదిబ్బ ,సోర్లగోంది, నాలి ,సంగమేశ్వరం , కృత్తివెన్ను మండలం చినగోల్లపాలెం, మచిలీపట్నం మండలం పెదపట్నం, మంగినపూడి, పోలాటి తిప్ప,గ్రామాల్లో ని తీర ప్రాంత ప్రజలుబిక్కు బిక్కు మంటున్నారు. అధికారుల సమాచారంతో మత్స్యకారులు ఒడ్డుకు చేరుకున్నారు. జిల్లాలో 7 మండలాల్లోని 51 గ్రామాల్లో 57 పునరావాస కేంద్రాల ఏర్పాటు చేశారు. ఈ పునరావస కేంద్రాలకు 1,814 మందిని తరలించారు. మరో 7,763 మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కృష్ణాజిల్లా కలెక్టర్ పి. రాజా బాబు ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతూ అప్రమత్తం చేస్తున్నారు.

**బాపట్లలో భయం భయం**

బాపట్ల జిల్లా బాపట్ల , రేపల్లె,చీరాలనిజాంపట్నం ప్రాంతాల్లో ఎస్టీఅర్ఎఫ బృందాలు అప్రమత్తమయ్యాయి.18 మంది ఎన్టీఆర్ఎఫ్ బృందాలు తీరప్రాంతానికి చేరుకున్నాయి. మరో 18 బృందాలు బాపట్లకు చేరుకుంటాయి. తీర ప్రాంతంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ తుపాన్ పునరావాస కేంద్రాలకు రెవెన్యూ,పోలీస్ శాఖ అధికారులు తరలిస్తున్నారు. ప్రజలకు భోజన సదుపాయం కల్పిస్తున్నారు.బాపట్ల జిల్లాలోని బాపట్ల సూర్యలంక సముద్రతీరం తుఫాన్ షెల్టర్లలో తీర ప్రాంత ప్రజలకు వసతి కల్పించారు.తుపాన్ ప్రభావంతో సముద్రంలో వేటనిషేధించి నల్లమడకాలవబోట్లు నిలిపివేశారు.

**కాకినాడలో ఆరెంజ్ అలర్ట్**

కాకినాడ జిల్లాలో ఈదురుగాలులతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉప్పాడ వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు బీచ్ రోడ్డును తాకుతున్నాయి. సముద్రం లోపల అల్లకల్లోల పరిస్థితితో కాకినాడ పోర్టులో బియ్యం ఎగుమతులను అధికారులు నిలిపివేశారు. దాదాపు పదికి పైగా విదేశీ నౌఖలు నిలిచిపోయాయి. మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్లరాదని, వేటకెళ్లిన వారిని తక్షణమే వెనక్కి రప్పించే ఏర్పాట్లు చేయాలని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ అధికారులను ఆదేశించారు . నెల్లూరు, కాకినాడ, కోనసీమ, ఏలూరు, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, శ్రీసత్యసాయి, నంద్యాల, కడప జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని ఆరెంజ్ అలర్ట్ ప్రకటించగా, మిగతా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ ప్రకటించింది.

**తిరుపతిలో భారీ వర్షం .. ఓ చిన్నారి మృతి**

పెను తుపాన్‌గా ఆవిర్భవించిన మైచాంగ్ ప్రభావంతో తిరుపతి జిల్లాలోని భారీ వర్షం కురుస్తోంది. పుణ్యక్షేత్రం తిరుపతిలో భక్తులు చలితో వణికిపోతున్నారు. ఏర్పాడు మండలం చిందేపల్లి ఎస్టీ కాలనీకి చెందిన నాలుగేళ్ల బాలుడు యశ్వంత్ మరణించినట్లు తెలుస్తోంది. ఇక నెల్లూరు, అన్నమయ్య రాయచోటి, చిత్తూరు జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడుతున్నాయి. గత శనివారం నుంచీ ఏకధాటిగా ఈ చిత్తూరు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి.

**విశాఖ నుంచి ఫ్లైట్ క్యాన్సిల్**

మైచాంగ్ తుఫానుతో విశాఖపట్నంలో విమాన సర్వీసులను రద్దు చేశారు.. విజయవాడ నుంచి మంగళవారం ఉదయం 9.00 గంటలకు విశాఖకు చేర్చాల్సిన ఇండిగో సర్వీస్ ను రద్దు చేశారు. విశాఖ నుంచి తిరుపతి వెళ్లాల్సిన సర్వీసును, చెన్నై నుంచి విశాఖకు చేరాల్సిన సర్వీసును, మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి విశాఖ రావలసిన విమానం సర్వీసును రద్దు చేశారు.

**తమిళనాడు గజగజ**

మైచాంగ్ తుఫానుతో తమిళనాడు గజగజ వణుకుతోంది. వారం రోజుల కిందటే భారీ వర్షాలతో తల్లడిల్లింది. ప్రస్తుతం ఏపీలో కేంద్రీకృతమైన తుపాను ప్రభావాన్ని అంచనా వేసిన తమిళనాడు ప్రభుత్వం .. తమ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించింది. పుదుచ్చేరీ కరైకల్ కలై సెల్వీ, కాంచీపురం, చెన్నై, చెంగల్పట్, తిరువల్లూరు ప్రాంతాల్లో పాఠశాలలను మూసివేశారు.

**ఏపీ ప్రభుత్వం అప్రమత్తం**

మైచాంగ్ తుపాను ప్రభావంపై ఏపీ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. అప్రమత్తంగా వ్యవహరించాలని విశాఖ నుంచి నెల్లూరు జిల్లా వరకూ రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల, కృష్ణా, ఏలూరు, భీమవరం, కాకినాడ జిల్లాల్లో పునరావాసం కోసం జిల్లాకు రూ.కోటి లు చొప్పున విడుదల చేసింది. ఆయా జిల్లాల్లో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేయటమే కాదు, బాధితులను తుపాను పునరవాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. సహాయక శిబిరాల్లో సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోండిఆహారం,తాగునీరు, మందుల సరఫరా, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టండితుపానుతో దెబ్బతినే వ్యవస్థలను యుద్ధప్రాతిపదికనపునరుద్ధరించాలి . కల్లాల్లో ధాన్యం తడిసిపోకుండా ప్రత్యేక చర్యలు తేమలాంటి సాంకేతిక అంశాలను పక్కనపెట్టి రైతుల వద్ద ధాన్యాన్ని సేకరించాలి-కలెక్టర్లకు సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. ధాన్యంలో తేమ శాతాన్ని చూడకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.'ధాన్యంలో తేమ శాతం పట్టించుకోవద్దు. ధాన్యం సేకరించి వెంటనే మిల్లుకు తరలించాలి. 7,20 లక్షల టన్నుల ధాన్యం సేకరణ చేయాలి. సదరు జిల్లాల్లో డ్రయర్లు లేకుంటే పొరుగు జిల్లాలకు పంపాలి. అందుకయ్యే రవాణా ఖర్చులనూ భరించాలి' అని స్పష్టం చేశారు

# మళ్లీ తెరపైకి ఇండియా కూటమి

ఢిల్లీ, ప్రజాపాలన ప్రతినిధి :కేంద్రంలో రెండు సార్లు వరుసగా అధికారంలోకి వచ్చింది బీజేపీ. ఈసారి ఆ దూకుడుకి కళ్లెం వేయాలని గట్టిగానే ప్రయత్నిస్తోంది కాంగ్రెస్. అందుకే ఎన్డీయేకి దీటుగా ఇం.డి.యా పేరుతో కూటమిని ఏర్పాటు చేసింది. అన్ని పార్టీలనూ సమన్వయం చేసుకుంది. ప్రస్తుతం ఈ కూటమిలో దాదాపు 26 పార్టీలున్నాయి. కాంగ్రెస్‌తో సైద్ధాంతిక విభేదాలున్నప్పటికీ బీజేపీని ఓడించాలన్న లక్ష్యంతో కొన్ని పార్టీలు కలిసొచ్చాయి. ఈ కూటమి పెట్టనైతే పెట్టారు కానీ అప్పటి నుంచి అంతా సైలెంట్ అయిపోయింది. కూటమి ఏర్పాటైన కొద్ది రోజులకే 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. కాంగ్రెస్ వెంటనే అప్రమత్తమైంది. పూర్తిగా ఈ అసెంబ్లీ ఎన్నికలపైనే ఫోకస్ పెట్టింది. కూటమి సంగతి తరవాత చూసుకుందామని వదిలేసింది. తరవాత ఎన్నికలు పూర్తయ్యాయి. నాలుగు రాష్ట్రాల ఫలితాలూ విడుదలయ్యాయి. వీటిలో తెలంగాణ మినహా మిగతా మూడు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్‌కి ఎదురు దెబ్బే తగిలింది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో బీజేపీ హవానే కొనసాగింది. ఉత్తరాదిన పూర్తిగా పట్టు కోల్పోయింది కాంగ్రెస్ పార్టీ. సౌత్‌లో మాత్రం కర్ణాటక, తెలంగాణను తమ ఖాతాలో వేసుకుంది. ఇది కొంత వరకూ ఊరటనిచ్చినప్పటికీ...నార్త్ బెల్ట్‌ని కోల్పోవడం మాత్రం పెద్ద దెబ్బే. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికలకు ముందు వచ్చిన ఈ ఫలితాలు బీజేపీ జోష్‌ని రెట్టింపు చేయగా...కాంగ్రెస్‌ని నిరాశపరిచింది. తెలంగాణ ప్రాతినిధ్యం వహించడం



గొప్ప విషయమే. కానీ...ఉత్తరాదిలో పార్టీ ఉనికి ప్రమాదంలో పడింది. ఈ సమయంలోనే ఇం.డి.యా కూటమి భవిష్యత్ ఏంటన్నదే అంతుపట్టకుండా ఉంది. విపక్ష కూటమికి నేతృత్వం వహించే బాధ్యతను కాంగ్రెస్ తీసుకుంటుందన్న అధికారిక ప్రకటన ఏమీ రాలేదు. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కన్వీనర్‌గా ఉంటారన్న వార్తలు అప్పట్లో బాగానే వచ్చాయి. కానీ...ఆ పదవిపై పెద్దగా ఆసక్తి లేదని తేల్చి చెప్పారు నితీశ్. నితీశ్ తరవాత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కీలకంగా వ్యవహరించారు. విపక్ష పార్టీల నేతలతో సంప్రదింపులు జరిపారు. అందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చేందుకు తన ప్రయత్నం తాను చేశారు. ఇదే సమయంలో 5 రాష్ట్రాల ఎన్నికలపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టారు. ముందు రాష్ట్రాల్లో గెలిస్తే ఆ తరవాత లోక్‌సభ ఎన్నికలపై ఫోకస్ పెట్టొచ్చని భావించారు. కాంగ్రెస్ దృష్టి పెట్టినప్పటికీ కొన్ని సమస్యల కారణంగా అనుకున్న స్థాయిలో రాణించలేకపోయింది. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ విపక్ష కూటమిని లీడ్ చేయగలుగుతుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. లోక్‌సభ ఎన్నికల స్ట్రాటెజీలు వేరు అని అంత సులువుగా కొట్టిపారేయలేం. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం కచ్చితంగా లోక్‌సభ ఎన్నికలపై ఉంటుంది. ఇదే కాంగ్రెస్‌ని ఇరకాటంలోకి నెట్టింది. కాంగ్రెస్ ఓడిపోవడంపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చేసిన కామెంట్స్‌ని బట్టి చూస్తుంటే కూటమిలో చీలికలు మొదలవుతాయా అన్న అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. మూడు రాష్ట్రాల్లో ఓడిపోవడం బీజేపీ సక్సెస్ కాదని, కాంగ్రెస్ వైఫల్యమే అని తేల్చి చెబుతోంది టీఎమ్‌సీ. జనతా దళ్ నేతలూ కీలక వ్యాఖ్యలు చేశారు. "కాంగ్రెస్ ఓడిపోవడం అంటే విపక్ష కూటమి ఓడిపోయినట్టు కాదు" అని స్పష్టం చేస్తున్నారు. బీజేపీని కాంగ్రెస్ ఢీకొట్టలేదని, ఆ భ్రమ నుంచి ఆ పార్టీ బయటకు రావాలని కొందరు విపక్ష నేతలు నేరుగానే చెబుతున్నారు. డిసెంబర్ 6వ తేదీన ఖర్గే నివాసంలో ఇం.డి.యా కూటమి సమావేశం కానుంది. ఈ భేటీకి కొందరు నేతలు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. శరద్ పవార్ కూడా చాలా క్లియర్‌గా ఓ విషయం వెల్లడించారు. ఈ ఫలితాలేవ విపక్ష కూటమిపై ప్రభావం చూపించలేవని స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పుంజుకోవడాన్ని మాత్రం విపక్షాలు స్వాగతిస్తున్నాయి. ఇది కచ్చితంగా ఆ పార్టీకి మంచి జోష్ ఇస్తుందని చెబుతున్నాయి. అయితే...మిగతా మూడు రాష్ట్రాల్లో ఓటమిపై మాత్రం విపక్ష పార్టీలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. కూటమి వ్యూహాలను మార్చాల్సిన అవసరముందని అభిప్రాయపడుతున్నాయి. అంతే కాదు. అసలు కూటమిలో కొనసాగాలా వద్దా అని పునరాలోచనలో పడ్డట్టా సమాచారం. ఇందులో నిజమెంత అన్నది మాత్రం స్పష్టత లేదు. ముఖ్యంగా సీట్ల షేరింగ్ విషయంలో కాంగ్రెస్ డిమాండ్ చేసే పరిస్థితి ఉండదు. మిగతా పార్టీలు ఏం చెబితే అది వినాల్సి వస్తుంది. లేదా పూర్తిగా కూటమే కూలిపోయే ప్రమాదం లేకపోలేదు. ప్రతి పార్టీ తమ ఓటు బేస్‌ని వదులుకునేందుకు ఇష్టపడదు. ఆప్, టీఎమ్‌సీ సహా మరి కొన్ని పార్టీలు కాంగ్రెస్‌తో కలిసి వెళ్లేందుకు పెద్దగా ఆసక్తి చూపించే అవకాశాలు తక్కువే. ఢిల్లీ, పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, బిహార్‌లో సీట్ షేరింగ్ విషయంలో విభేదాలు తలెత్తే అవకాశాలున్నాయి. ఈ విభేదాలు ఫైనల్‌గా బీజేపీకే ప్లస్ అవుతాయి. వాళ్లలో వాళ్లకే సఖ్యత లేదని ఇప్పటికే బీజేపీ ప్రచారం చేస్తోంది. నాయకత్వ లోపమూ విపక్ష కూటమిని ఇబ్బందుల్లో పెడుతోంది. కాంగ్రెస్‌లోనే అంతర్గతంగా ఈ విషయంలో సఖ్యత కుదరకపోవచ్చు కూడా. తమ ఓటు బ్యాంకునీ కాపాడుకోవడంలో నానా అవస్థలు పడుతోంది ఈ పార్టీ. ఇలాంటి సమయంలో సరైన నాయకత్వం లేకపోతే మరింత చతికిలబడి పోవడం ఖాయం. కానీ బీజేపీకి ఈ సమస్యలేదు. బలమైన నాయకత్వమే ఆ పార్టీని ముందుకు నడిపిస్తోంది. కూటమిలో చీలికలు వస్తాయని జోస్యం చెబుతున్నారు బీజేపీ నేతలు. అసలే సమస్యలతో సతమతం అవుతున్న కాంగ్రెస్‌ని మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు మరింత ఇబ్బంది పెడుతున్నాయి. ఈ ఎన్నికల్లో గెలిచి ఉంటే కాంగ్రెస్ పరిస్థితి చాలా వరకూ మారిపోయేది. కానీ...తెలంగాణలో గెలిచామన్న సంతోషం తప్ప మరేమీ మిగల్లేదు. ఇప్పటికే బీజేపీ బలపడుతోంది. కాంగ్రెస్ ఓటమి బీజేపీకి చాలా ప్లస్ అవుతుంది. సీట్ల సంఖ్యని మరింత పెంచే అవకాశాలూ ఉన్నాయి. కాంగ్రెస్ భవిష్యత్‌ని నిర్ణయించనున్న ఈ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆ పార్టీకి జోష్ ఇస్తాయనుకుంటే ఉన్న జోరునీ తగ్గించాయి. ఇప్పటి నుంచి ఈ పార్టీ వ్యూహాలు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. భారత్ జోడో యాత్రతో కొంత క్యాడర్‌లో జోష్ పెరిగిందని భావించినా...అది ఎంతో కాలం కొనసాగేలా లేదు.

# తుఫాను నేపథ్యంలో ముమ్మరంగా జాగ్రత్త చర్యలు చేపట్టాం: కలెక్టర్ పి రాజాబాబు




మచిలీపట్నం, డిసెంబర్ 4, ప్రజాపాలనజిల్లాలో మిచౌంగ్ తుపాన్ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు నేతృత్వంలో జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు జాగ్రత్త చర్యలు ముమ్మరంగా చేపట్టింది.ముఖ్యంగా మి చౌంగ్ తుపాను ప్రభావిత మండలాలైన నాగాయలంక, కృత్తివెన్ను, కోడూరు, మచిలీపట్నం, బంటుమిల్లి, అవనిగడ్డ, మోపిదేవి మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. తుఫాను పరిస్థితులను పర్యవేక్షించేందుకు సముద్రతీర మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించడంతో పాటు ఆయా మండలాల పరిధిలో తుపాన్ షెల్టర్లు, పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తించి అవసరమైన వసతులను ఏర్పాటు చేశారు. అనంతరం లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను, శిధిలావస్థలో ఉన్న ఇల్లు గుడిసెల్లో నివసిస్తున్న ప్రజలను దగ్గరలోని తుపాను షెల్టర్లు, పునరావాస కేంద్రాలకు తరలించారు.నాగాయలంక మండల పరిధిలో 14 పునరావాస కేంద్రాలు, కోడూరు 6, మచిలీపట్నం 21, కృత్తివెన్ను 5, అవనిగడ్డ 4, మోపిదేవి 3, బంటుమిల్లి 4 కలిపి మొత్తం 57 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు మొత్తం 1,899 మంది ప్రజలను లోతట్టు ప్రాంతాల నుంచి ఆయా పునరావాస కేంద్రాలకు తరలించి వారికి ఉదయం పూట అల్పాహారం, పాలు, మధ్యాహ్నం, రాత్రికి భోజనం ఏర్పాట్లను చేశారు. తీవ్రతను బట్టి ఇంకా 7 వేల మందికి పైగా ప్రజలను పునరావాస కేంద్రాలకు ఈ రోజు సాయంత్రం తరలించే అవకాశం ఉండటంతో అందుకు తగ్గ ఏర్పాట్లను చేశారు.పునరావాస కేంద్రాల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టి ఆహారం, మంచినీరు, విద్యుత్ సౌకర్యం, టార్చి లైట్లు, రైన్ కోట్లు, జనరేటర్లతో పాటు అన్ని అందుబాటులో ఉంచుకునేలా ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా కావలసిన మందులతో వైద్య శిబిరాలు అక్కడే ఏర్పాటు చేశారు.వైద్య ఆరోగ్యశాఖ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటలు పని చేసే విధంగా వైద్యులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు ఇతర వైద్య ఆరోగ్య సిబ్బంది వారి ప్రధాన కార్య స్థానాల్లో అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించే విధంగా ఏర్పాటు చేశారు. అంతే కాకుండా కావలసిన మందులు ముఖ్యంగా పాము కాటు నివారణ మందు కూడా సిద్ధంగా ఉంచుకున్నారు.తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులందరూ ఎప్పటికప్పుడు పర్యటిస్తూ అక్కడి ప్రజలను ముఖ్యంగా మత్స్యకారులను తుపాను సందర్భంగా పాటించవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించి వారిని అన్ని విధాల అప్రమత్తం చేస్తున్నారు. మత్స్యకారులు ఎవరూ కూడా చేపల వేటకు సముద్రంలోకి వెళ్లకుండా నియంత్రించారు.వారి పడవలను దెబ్బ తినకుండా సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకునేలా ఏర్పాటు చేశారు. వారికి కావలసిన ఆహారము, మంచినీరు అన్నిటిని అందించి అన్ని విధాల ఆదుకున్నారు.తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు పరిశీలించి దెబ్బతిన్న వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంతో పాటు సరైన స్థితిలో ఉండేలా ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా విద్యుత్ స్తంభాలకు అనుకుని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు.కలెక్టరేట్ తో సహా అన్ని ఆర్డీవోలు, తహసిల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ విభాగాలు ఏర్పాటు చేసి నిరంతరం పనిచేసేలా ఏర్పాట్లు చేశారు.కలెక్టరేట్లో 08672 252572, 252000 నంబర్తో తుఫాను సమాచారం గానీ సహాయక చర్యల కోసం గానీ సంప్రదించవచ్చని జిల్లా జిల్లా యంత్రాంగం తెలిపిందిసముద్ర తీర ప్రాంతాల్లో ప్రజలు సముద్రం వద్దకు వెళ్లకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.జిల్లాలో రైతులు కోత కోసిన 20 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వర్షాలకు తడిసి దెబ్బ తినకుండా ముందుగానే లారీలకు ఎక్కించి సురక్షితంగా గోదాములకు తరలించడం జరిగింది. తుఫాను సహాయక చర్యల కోసం 37 మంది సభ్యులతో కూడిన ఎస్.డి.ఆర్ఎఫ్ బృందం అవనిగడ్డ లోను, 25 మంది సభ్యులతో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందం మచిలీపట్నంలోనూ సిద్ధంగా ఉన్నాయి.

## " రైతులకు అండగా ప్రభుత్వం: ప్రభుత్వ విప్ గ్రంధి



భీమవరం, డిసెంబర్ 4 (ప్రజాపాలన ప్రతినిధి) :రైతులకు ప్రభుత్వం అండగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఖరీఫ్ పంట చేతికొచ్చే సమయంలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావం వల్ల ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పంట నష్టపోకుండా కాపాడుకునే విధంగా వ్యవసాయశాఖ అధికారులు, రైతు భరోసా కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బంది రైతులకు అండగా ఉండాలని ఆయన సూచించారు. రైతులకు ఎప్పటికప్పుడు తగు సూచనలు ఇచ్చి భరోసా కల్పించాలన్నారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయం నుండి ఆయన వ్యవసాయశాఖ ఏడి చింతల శ్రీనివాసరావుతో ఫోన్లో మాట్లాడారు. భీమవరం నియోజకవర్గంలో పంట పొలాల పరిస్థితిపై, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎక్కడైనా పంట నష్టం జరిగిందా అని ఆయనఆయన ఆరా తీశారు.

## కార్తిక వనభోజనాలు




ప్రజాపాలన ప్రతినిధి బద్వేల్: ఆర్యవైశ్య వర్తక సంఘం మాజీ అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు ఆధ్వర్యంలో కార్తిక వనభోజనాలు కార్యక్రమాన్ని కొల్లూరు మూకాంబిక అమ్మవారి దర్శనం అనంతరము నిర్వహించారు ఈ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర ఆధ్యాత్మిక యాత్రను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు చాటకొండ వెంకట నాగేశ్వరావు ను వర్తక సంగం మాజీ అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు మరియు కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మాజీ సెక్రెటరీ ఉరిమి శ్రీనివాసులు మాజీ కమిటీ సభ్యులు రిటైర్డ్ లెక్చరర్ కొలిశెట్టి సుబ్బారావు చిన్ని శీను వల్లంకొండ సత్యనారాయణ దేవతి సుబ్బారావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహిళా మండలి ఉపాధ్యక్షులు కొండపల్లి దేవి బద్వేల్ మహిళా మండలి సభ్యులు దేవత లలిత ఉరిమి పద్మావతి తులసి వరలక్ష్మి వల్లంకొండు శారద కొండపల్లి సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని కార్యాలయం ప్రశంసలందుకున్న.. ప్రకాశరావుపాలెం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర!




నల్లజర్ల: ప్రజాపాలన ప్రతినిధి :నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలో ఆదివారం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించిన తీరు అద్భుతమని ప్రధానమంత్రి కార్యాలయం ప్రశంసించింది. సంకల్ప యాత్ర కో ఆర్డినేటర్, ఎస్.కె.హనీఫ్ (ఎం.సి) ఈ విషయాన్ని సోమవారం తెలియజేశారు. ప్రకాశరావుపాలెంలో నిర్వహించిన భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని బీజేపీ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టిపల్లి శివనాగరాజు విన్నూత్నంగా నిర్వహించడం ద్వారా ఈ కార్యక్రమం సాక్షాత్తూ ప్రధానమంత్రి కార్యాలయం ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా, మా సంకల్పం అభివృద్ధి చెందిన భారతదేశం నినాదంతో జరుగుతున్న ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను గురించి పలు శాఖల అధికారులు ప్రజలకు తెలియజేస్తూ వారికి అవగాహన కలిగిస్తున్నారు. అయితే, అన్ని చోట్లా జరిగే కార్యక్రమానికి భిన్నంగా కోవిడ్ కష్ట కాలంలో ప్రాణాలు తెగించి మరీ ప్రజల ప్రాణాలను కాపాడిన వైద్యులు డాక్టర్ తెల్లం గంగాధరరావును సత్కరించడం ఒక ఎత్తయితే, ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఇదే కార్యక్రమంలో ప్రత్యేకించి ఓ దివ్యాంగ వృద్ధుడికి పండ్లు ఇచ్చి దుశ్శాలువాతో సత్కరించడం, దివ్యాంగుల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు తెలియజేస్తూ బిజెపి నేత శివనాగరాజు చేసిన విన్నూత్నమే ప్రధాని కార్యాలయం వరకూ ప్రకాశరావుపాలెం కార్యక్రమం చేరేట్టు చేసింది.

## ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ఆంధ్ర రాష్ట్ర మొత్తం నీళ్లల్లో నానతా ఉంది..:మాజీ మంత్రి కొల్లు రవీంద్ర.



మచిలీపట్నం, డిసెంబర్ 4, ప్రజాపాలన: తుఫాన్ ప్రభావంతో చేతికి అందించిన పంట నీట మునగడంతో మచిలీపట్నం నియోజకవర్గం గుండు పాలెం, చిన్నాపురం తదితర ప్రాంతాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించిన మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాట్లాడుతూ....ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ రోజు రైతాంగం కళ్ళలో నీళ్లు కనబడుతున్నాయి. ఎంతగానో కష్టపడి పంట పండించుకుని ధాన్యం ద్వారా శ్రమకి ఫలితం వస్తుందినే సమయానికి తుఫాను వలన మొత్తం కూడా నీటుపాలు అయింది. దాదాపు వరి పండం దక్కింది పడిపోయి నీళ్లలో తేలుతు ధాన్యం కుళ్ళు పోతుంది. ఇది కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే. గతంలో కూడా మేము చాలాసార్లు చెప్పాము. కాలువల్లో ఎప్పటికప్పుడు మట్టి తీయకపోవడం వలన ఎక్కడకక్కడ నీరు నిలిచిపోయి పంట పొలాలు పడిపోయే దానికి కారణమయ్యింది. గత నాలుగున్నర సంవత్సరాలుగా ఎక్కడ కూడా ఒక చెంచాడు మట్టి తీయలేదు. గత టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు జూన్ మాసం కల్లా నీళ్లు ఇచ్చి సెప్టెంబర్ అక్టోబర్ మాసానికి పంటపొలాలు చేతికందే విధంగా చేశారు. దాని ద్వారా నవంబర్, డిసెంబర్ లో వచ్చే తుఫాన్లు తప్పించుకునే దానికి ఆలోచన చేశారు. నీళ్లు సకాలంలో అందించడానికి పట్టిసీమ ప్రాజెక్టును ముందుకు నడిపిస్తే ఈ ప్రభుత్వం దానిని విస్మరించి ప్రాజెక్టును నీరుగార్చింది. ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న అంబటి రాంబాబుకి అసలు ఆ శాఖ కోసం కనీసం అవగాహన లేకపోవడం దౌర్భాగ్యం. పోలవరం, పట్టిసీమ ప్రాజెక్టులను నీరుగార్చడం వలన సకాలంలో నీళ్లు అందించక చేతికందిన పంటను కోల్పోయారు రైతన్నలు. గత ప్రభుత్వంలో ఎలాంటి పరిస్థితులు వచ్చినప్పుడు ముందుగానే వాళ్ళకి రేషన్ ఇచ్చి, నిత్యాసర సరుకులు ఇచ్చి ఆదుకునేది. ఈరోజు కనీసం వచ్చి పలకరించే నాధుడు లేకపోవడం బాధాకరం. ధాన్యం నష్టపోయిన రైతం గాని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి. రైతాంగం పక్షాన పోరాటం కోసం తెలుగుదేశం పార్టీ ఎప్పుడు ముందుంటుంది.మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.చేతికి అందిన పంటని సరైన సమయంలో ప్రభుత్వం సాకారం అందించకపోవడంతో తుఫాను వచ్చి పంట పొలాలని నీట మునిగిపోతున్నాయి. కోతకొచ్చిన పంటని కొత్త మిషన్ల ద్వారా సరైన సమయానికి ప్రభుత్వం సహాయం అందించి కోయించినట్లయితే ఈ రోజు ఈ పరిస్థితి ఉండేది కాదు.మాజీ జడ్పిటిసి లంకె నారాయణ ప్రసాద్,కాగిత గోపాలరావు, లంకె శేషగిరి,, సలీం,వన రాజు,చిన్నం శేఖర్, లింగం విజయ్, రాయన శివ, పిన్నింటి అయ్యప్ప తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.



## నందివాడలో గణంగ మాజీ ఎ.ఎం.సి చైర్మన్ తోట నాగరాజు పుట్టినరోజు వేడుకలు



గుడివాడ,ప్రజాపాలన ప్రతినిధి నందివాడ 10వ వార్డులోని కొండపల్లి కన్వెన్షన్ తోట నాగరాజు పుట్టినరోజు కేక్ కటింగ్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు పెయ్యల జగదీష్ మాట్లాడుతు జగనన్న ఆలోచనలని పథకాలనీ ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రజా శ్రేయస్సు కోసం ప్రత్యేకమైన చోరవ కనబరుస్తు గ్రామములో కులమాతలకి అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న తోట నాగరాజుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారూ.రానున్న రోజుల్లో మళ్లీ వై.యస్.ఆర్.సి.పి అధికారంలోకి రావడం తధ్యమని ఆయన అభిమానులు కార్యకర్తలు ఆయన వెన్నంటే ఉండీ గ్రామఅభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకుని అయన అడుగుజాడల్లో నడుస్తారని పెయ్యాల జగదీష్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు వై.ఎస్.సి.పి అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## గ్రామస్తులకు నిత్యవసరం సరుకులు అందజేసిన పంజాబ్ బ్రదర్స్



రైల్వే కోడూరు : ప్రజాపాలన ప్రతినిధి :అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు మండలం అనంతరాజుపేట గ్రామపంచాయతీ ఫారం ఎస్టీ కాలనీ సందర్శించిన అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి బ్రదర్స్ పంజం వేణుగోపాల్ రెడ్డి రెండు మూడు రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్ గా మారడంతో ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుంది శేషాచలం అడవుల గుండా ప్రవహిస్తున్న గుండాల్ ఏరు వాగు పరివాహక ప్రాంతం అయినా ఫారం ఎస్టీ కాలనీ సందర్శించి గ్రామంలోని వారితో మాట్లాడుతూ పెద్ద వర్షం వస్తే దగ్గర్లో ఉన్న ఆగ్రో సంస్థకు చెందిన సముదాయంలో ఉండాలని గ్రామస్తులకు తెలియజేయడం జరిగింది గ్రామంలోని వారికి నిత్యవసర వస్తువులు అందజేయడం జరిగింది అలాగే గవర్నమెంట్ హాస్పిటల్ నుండి ముందస్తు చర్యగా మందులు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పాలెం కోట రత్నమ్మ పంచాయతీ సెక్రెటరీ శ్రీదేవి మహిళా పిఎస్ ఏఎన్ఎం సచివాలయం అధికారులు వైయస్సార్సీపీ గిరిజన నాయకులు పాలెం కోట చంద్ర గృహసారథులు భాస్కర్ కొండమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు

## కార్తీక సోమవారం సందర్భంగా మహా శివునికి ప్రత్యేక పూజలు...



మచిలీపట్నం, డిసెంబర్ 4, ప్రజాపాలన: కార్తీక మాసం పురస్కరించుకుని మూడో సోమవారం సందర్భంగా ప్రతి శివాలయాలలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుఫాను సైతం లెక్కచేయకుండా భక్తులు శివాలయాలకు తరలివచ్చి దీపారాధన చేస్తూ శివుని దర్శించుకున్న. కొజ్జాలపేట, నాగేశ్వర స్వామి గుడిలో చైతన్య కుమార్ శర్మ ఆధ్వర్యం లో శివునికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు చేశారు. గొడుగు పేట శివాలయం లో, బచ్చుపేట శివాలయం లో ,కన్యకా పరమేశ్వరి దేవాలయం, లో శివునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

## అకాల వర్షం లోను ఆగని నరేంద్రుడి సంకల్పం

### పేదల ఆకలి తెర్చడమే ద్యేయం



బాపట్ల జిల్లా ప్రజపాలన డిసెంబర్ 4 జోరు వర్షం లో కూడా కొనసాగిన అన్న కాంటీన్.395రోజులుగా నిరంతరాయంగా కొనసాగుతున్న అన్న క్యాంటీన్స్వర్గీయ నందమూరి తారకరామారావు శత జయంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు లినారా చంద్రబాబు నాయుడులి పిలుపు మేరకు పేద ప్రజల ఆకలి తీర్చాలన్న సంకల్పంతో లిబాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలి వద్ద తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ లివేగేశన నరేంద్ర వర్మలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లిఅన్న క్యాంటీన్లి నందు నేడు 395వ రోజు దాదాపు 300 మంది పేదలకు అన్న వితరణ చేయడం జరిగింది...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

మంగళవారం 05, డిసెంబరు 2023

## కంపెనీల పురుగు మందుల వ్యాపారం!

ఆహార పంటల ఉత్పత్తిలో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం తీవ్రరూపం దాల్చింది. అవి లేకుండా దిగుబడులు రాని పరిస్థితి ప్రపంచ వ్యాపితంగా ఏర్పడింది. పురుగుమందుల వినియోగం నిరంతరం సేద్యంలో పెరుగుతూ ఉండటంతో వాటి ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతున్నాయి. వినియోగం పెరుగుదల బడా పురుగు మందుల కంపెనీలకు లాభాల బాట పట్టిస్తున్నది. గత మూడు దశాబ్దాల్లో పురుగు మందుల వాడకం చాలా ఎక్కువగా వుంది. ప్రపంచ వ్యాపితంగా 2019లో వ్యవసాయ పురుగు మందుల వాడకం 4.19 బిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకుంది. ఇది హెక్టార్‌కు 2.69 కిలో గ్రాములుగా ఉంది. ప్రపంచ వ్యాపితంగా వినియోగించే పురుగుమందుల్లో సగానికి పైగా వినియోగించే ప్రాంతం ఆసియా పసిపిక్. పంట భూమిలో అత్యధికంగా పురుగు మందుల వినియోగించే ప్రాంతం ఆసియా, అమెరికా. భారత దేశంలో పరుగు మందుల తయారీ 1952లో ప్రారంభమైంది. బెంజిన్ హెక్సాక్లోరైడ్, దాని తర్వాత డిడిటి ఉత్పత్తి జరిగింది. 1958లో భారత దేశం 5 వేల మెట్రిక్ టన్నుల పురుగుమందుల ఉత్పత్తి జరిగింది. 1990ల మధ్య కాలంలో 145 పురుగు మందుల నమోదుతో ఉత్పత్తి 85 వేల టన్నులకు పెరిగింది. క్రమంగా 90 వేల టన్నుల వార్షిక ఉత్పత్తితో ఆసియాలో పురుగు మందులు ఉత్పత్తి చేసే ప్రముఖ దేశాల్లో భారత దేశం ఒకటిగా ఉంది. భారత దేశం ప్రధానం వ్యవసాయ ఉత్పత్తిదారుగా ఉంది. దీనిపై 100 కోట్ల దాకా ప్రజలు ఉపాధి పొందుతున్నారు. భారత దేశ రైతు సేద్యం ఇప్పటికీ వెనకబడే ఉంది. పాలకుల చేయూత లేకపోవడమే దానికి కారణంగా వుంది. పంటలకు చీడపీడల బెడద రైతాంగాన్ని వెన్నంటి వస్తూనే ఉంది. మొదట తెగుళ్ల నివారణకు రైతాంగం సాంప్రదాయ పద్ధతుల్లో బూడిద, వేప పిండి, వేప పసరు మొదలైనవి రైతాంగం వినియోగించారు. ఆ తర్వాత డిడిటి ఎక్కువ ఉపయోగించారు. 1966లో భారత పాలకులు సస్యవిప్లవం ప్రకటించి అధిక దిగుబడుల కోసం హైబ్రిడ్ విత్తనాలు దిగుమతి చేసుకున్నారు. ఆ విత్తనాలతో పాటు వాటి నుంచి వచ్చే కొత్త తెగుళ్లు దిగుమతి అయ్యాయి. వాటి నివారణకు ఆ కంపెనీలే పురుగుమందులను దేశానికి పంపాయి. ఆ విధంగా రసాయనిక పురుగు మందులు సేద్యంలోకి ప్రవేశించాయి. పురుగు మందుల ఉత్పత్తి: తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవడానికి విపరీతంగా రసాయనిక పురుగు మందులను వినియోగిస్తున్నారు. 2015- 2022 మధ్య భారత దేశం అంతటా ఉత్పత్తి చేయబడిన పురుగు మందుల పరిమాణం 1000 వేల మెట్రిక్ టన్నులుగా 16- మే -2023న స్టాటిస్టా రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ ప్రచురించింది. 2022 ఆర్థిక సంవత్సరంలో 229 వేల మెట్రిక్ టన్నుల పురుగు మందులు ఉత్పత్తి జరిగిందంటే సేద్యంలో పురుగు మందుల వాడకం ఎంత మోతాదులో జరుగుతున్నదో అర్థమవుతుంది. 2020-2022 సంవత్సరాల్లో భారత ప్రభుత్వం ప్రచురించిన డేటా ప్రకారం వార్షిక పురుగు మందుల వాడకం 40 వేల మెట్రిక్ టన్నులగా ఉంది. భారతీయ మార్కెట్: పురుగు మందుల ఉత్పత్తిలో కీలక రసాయనం అయిన మాలిక్యూల్స్ తయారు చేసే కంపెనీలు భారత్ లో దాదాపు 80 దాకా ఉన్నాయి. ఫార్మలేషన్ (తుది ఉత్పాదన) రూపొందించే కంపెనీలు 2 వేలు ఉన్నాయి. మాలిక్యూల్స్ తయారీకి కావాల్సిన ముడి సరుకు విదేశాల నుండి దిగుమతి అవుతుంది. దీని ధర కంపెనీల ఇష్టానుసారంగా ఉంటుంది. ఫలితంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్ కంటే భారత దేశంలో పురుగు మందుల ధర 40% ఎక్కువ. దేశంలో18 వేల కోట్ల రూపాయల పురుగు మందుల వ్యాపారం జరుగుతున్నది. 50 లక్షల మంది ఈ రంగంలో ఉన్నారు. ప్రమాదకర బిల్లు: పురుగు మందుల తయారీలో వున్న భారతీయ కంపెనీల మనుగడ సంక్షోభంలో పడే పరిస్థితి ఏర్పడింది. మోడీ ప్రభుత్వం పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ బిల్లు 2017 తీసుకు వచ్చింది. ఈ బిల్లు బహుళ జాతి కంపెనీలకు మరింతగా సహకారాన్ని అందిస్తుంది. ఈ బిల్లు అమలులోకి వస్తే దేశీయ కంపెనీల మనుగడ కష్టమని పరిశ్రమ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇక్కడి మార్కెట్లో ఎంఎన్‌సిలు 40% దాకా ఒప్పందాలు చేసుకున్నాయి. నమోదు కాకున్నా విక్రయాలు: ఇన్‌సెక్టిసైడ్స్ యాక్టు 1968 ప్రకారం భారత్‌లో విదేశీ కంపెనీలు పరుగుల మందులు విక్రయించాలంటే సెంట్రల్ ఇన్ సెక్టిసైడ్స్ బోర్డు అండ్ రిజర్వేషన్ కమిటీలో మాలిక్యూల్ (రసాయనం) నమోదు తప్పనిసరి. అది సెక్షన్ 9(3) కింద నమోదు జరుగుతుంది. ఇదే మాలిక్యూల్ భారత కంపెనీలు తయారు చేయాలంటే సెక్షన్ 9(4)కింద దరకాస్తు చేయాలి. రిజస్ట్రేషన్ లేకుండానే 2007 నుంచి భారత్‌లో పలు విదేశీ కంపెనీలు 127 ఉత్పత్తులను విక్రయిస్తున్నాయి. వీటి వ్యాపారం సాలీనా రూ. 7 వేల కోట్లు. మోడీ ప్రభుత్వం వీటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం నాణ్యతను కూడా పరీక్షించడం లేదు. సుమారు 100 మాలిక్యూల్స్‌ను ఎంఎన్‌సిలు తమ చేతుల్లో పెట్టుకుని భారత్ మార్కెట్‌ను శాసిస్తున్నాయి. ఎంఎన్‌సిల చేతుల్లో వున్న ఫార్మేషన్‌ను భారతీయ కంపెనీలు తయారు చేసేందుకు వీలుగా ఉన్న ఇన్ సెక్టిసైడ్స్ యాక్టులో ఉన్న 9(4) నిబంధనకు మోడీ ప్రభుత్వం తెచ్చిన బిల్లు ప్రమాదంగా ఉంది. యాక్టులో వున్న 9(4) కొనసాగించాలని దేశీయ కంపెనీలు డిమాండ్ చేస్తున్నాయి. దాన్ని కొనసాగించకపోతే భారత కంపెనీల మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. బడా కంపెనీల లాభాలు: పురుగు మందుల వ్యపారంలో సింజెంటా ప్రపంచంలోనే అగ్రగామిగా వుంది. పురుగు మందుల అమ్మకాల్లో దాదాపు 13.3 బిలియన్ల అమెరికన్ డాలర్లను ఆర్జించింది. ఈ అమ్మకాల్లో భారత దేశంలో దీని వాటా 3%గా వుంది. దీన్ని 10 శాతానికి పెంచాలని భావిస్తున్నది. దీని తర్వాత రెండవ అతి పెద్ద పురుగు మందుల కంపెనీ బేయర్స్ క్రాప్ సైన్స్. ఇది బేయర్స్ ఎజి ఉప కంపెనీ. దీని పురుగు మందుల అమ్మకాలు 11.3 బిలియన్ల అమెరికా డాలర్లు. 2021లో విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలతో సహా దీని ఆదాయం 20 బిలియన్ల యూరోలుగా ఉంది. భారత దేశంలో దీని వ్యాపా రం విస్తరించి వుంది. బడా కంపెనీలన్నీ గుత్తాధిపత్యం కోసం విలీనాలు, కొనుగోళ్ళకు సిద్ధమయ్యాయి. డే కెమికల్ ఇ డిపాంట్, దె నిమోరస్ మధ్య 2017లో విలీనం జరిగింది. 2018లో మోన్ శాంటోను బేయర్ కొనుగోలు చేసింది. రసాయన పురుగు మందుల వినియోగం వలన పొలాల నుంచి ప్రవహించే నీరు స్థానిక నీటి వనరులైన చెరువుల, సరస్సుల్లోకి ప్రవేశించి వాటిని కలుషితం చేస్తాయి. ఈ నీటితో జీవరాసులు చనిపోతాయి. అనేక సర్వేల ప్రకారం పెద్ద ఎత్తున చేపలు చనిపోవడానికి పురుగు మందులే ప్రధాన కారణం.

సామాజిక దృక్పథంతో మీరు రాసే రచనలు
editor. prajapalana@gmail.com
మెయిల్ కు పంపించినచో ప్రజా పాలన
దినపత్రికలో ప్రచురించబడును

# గెలుపు ఓటములకు కారణాలు


ఆట ఆడుతున్నప్పుడు ఉండే ఆవేశకావేశాలు విజయవం వరించిన తర్వాత విజయోత్సవంగా మారుతాయి. . గెలిచిన తర్వాత ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. అంతదాకా సాగిన యుద్ధకాండ బీభత్సరసం తొలగిపోయి ప్రశాంత వాతావరణంలో పరిపాలనకు పూనుకోవాల్సి ఉంటుంది. గెలుపుకు బాట వేసిన పోరాటాలు, ఉ ద్యమాలు, స్ఫూర్తి, ప్రజల ఆకాంక్షలు, రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమ ఇప్పుడు మలుపు తిప్పిన చరిత్ర. వాటిని రికార్డు చేయడం అవసరం. ఆశయాల సాధనకు రేవంత్ రెడ్డితోపాటు ఎందరో అలుపెరుగని పోరాటాలు చేశారు.

ఆరు గ్యారంటీలు ప్రజలను బాగా ఆకర్షించాయి. దుద్దిళ్ళ శ్రీధర్ బాబు నాయకత్వంలో రూపొందించిన ఎన్నికల మ్యానిఫెస్టోలో అనేక విషయాలు పొందుపరచబడ్డాయి. ప్రజలను కొత్తగా ఆలోచింపజేశాయి. మార్పు రావాలి. కాంగ్రెస్ రావాలి. సాలు దొర, సెలవు దొర వంటి నినాదాలు అద్భుతంగా ఆకర్షించాయి. రైతుబంధు బాధితులైన రైతు కూలీలు, కౌలుదార్లు, ధరణి బాధితులైన లక్షలాది పేద రైతులు మౌనంగా నిరీక్షించి సరైన నాయకత్వం రాగానే తమ అభిప్రాయాలను వెల్లడి చేశారు. నిరంతర ఆవేదనతో , ఉద్రేకంతో రగిలిపోయిన నిరుద్యోగులు నిప్పురవ్వలై గ్రామగ్రామాన ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. తమకు కావాల్సిన ప్రభుత్వం ఏమిటో అర్థం చేసుకున్నారు. ఓట్లు వేయించారు. ఒక నిరుద్యోగి, పేదరాలు బర్రెలక్క శిరీష ఎన్నికల్లో నిలబడి కోట్లాది హృదయాలను గెలుచుకొని ప్రపంచవ్యాప్తంగా యువతరంలో స్ఫూర్తి నింపింది. దాంతో నిరాశ నిస్పృహతో ప్రచారం చేద్దామనుకున్న నిరుద్యోగులకు, యువతకు ఊహించలేని ఉత్సాహం, ఆత్మ విశ్వాసం పెరిగింది. ఇది ప్రతి నియోజకవర్గంలో ఓట్ల రూపంలో ప్రతిఫలించింది. హైదరాబాద్ రింగ్ రోడ్డు చుట్టూత రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బిఆర్ఎస్ ఎక్కువ సీట్లు తెచ్చుకోవడం ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అవసరం. వాళ్ళు గెలవడానికి ఓట్లు తక్కువ పోలవ్వడానికి రియల్ ఎస్టేట్కు, సాఫ్ట్వేర్ రంగానికి మధ్య ఏదో సంబంధం ఉండి ఉంటుంది

ఈ గెలుపు కాంగ్రెస్ గెలుపు మాత్రమే కాదు. తెలంగాణ రాష్ట్ర సాధకేవలం టిఆర్ఎస్ వల్లో, కేసిఆర్ వల్లో సాకారం కాలేదు. అది కోట్లాది ప్రజల త్యాగాలతో, ఉద్యమాలతో సాకారమైంది. అంతిమంగా సోనియాగాంధీ స్పీకర్ మీరాకుమార్, ప్రతిపక్ష బిజెపి నాయకురాలు సుష్మాస్వరాజ్ కలిసి కట్టుగా పూనుకోవడంవల్ల తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. ప్రజల దరి త్యాగాలను గెలపును కేసిఆర్ తనదే అని ప్రచారం చేసుకున్నారు. ఆ గెలుపు అందరిది. ఈ మాట అన్నందుకు ఈటల రాజేందర్ పై పగపట్టారు. ఒక సెక్షన్ ప్రజలకు దూరమయ్యారు. అక్కడి నుండి కెసీఆర్ అడుగులని తప్పటడుగులే.

అలాగే కాంగ్రెస్ విజయం కూడా తెలంగాణ ప్రజల రెండవ విజయం. ఆనాడు తెలంగాణ రాష్ట్ర సాధనకోసం ఎన్ని వర్గాలు కలిసి ఉద్యమించాయో దాదాపు అన్ని విభిన్న వర్గాలు ''గెలిపించిన చేత్తోనే ఓడించడానికి " కృషి చేశాయి.

ప్రజలు ఓపిక పట్టారు. లోలోపల బాధపడ్డారు. పదేళ్ళు గెలిచి భోగభాగ్యాలు అనుభవించిన వారికి సహజంగానే అహంకారం, గర్వం,




నిర్లక్ష్యం తలకెక్కుతుంది. అందుకే అమెరికాలో నాలుగేళ్ళకోసారి రెండుసార్లకు మించి అధ్యక్షుడు కాకూడదని 200 యేళ్ళ క్రితమే రాజ్యాంగంలో పొందుపరుచుకున్నారు. బీసీల కుల గణన చేస్తామని ఇచ్చిన హామీ ఓట్లను చాలామేరకు మలుపు తిప్పింది.

కేసిఆర్ అధికారంలోకి రావడంతోనే అందరికన్నా ఎక్కువగా పోలీసు నియామకాలు చేశారు. ప్రగతి భవన్లో బుల్లెట్ ప్రూఫ్ అద్దాలు పెట్టించారు. ఇవి వారు భవిష్యత్తులో పోలీసులమీద ఆధారపడి పరిపాలన చేయాలనుకున్నారని స్పష్టం చేశాయి. నిజానికి కేసిఆర్ కు పరిపాలన రాదు. ఎన్నుకున్న ప్రజలకు అందుబాటులో లేని ముఖ్యమంత్రి మనకెందుకు. ? సచివాయం రాకుండా ప్రజలకు ప్రజా ప్రతినిధులకు దొరకకుండా ఇంటికాడ నుంచి, ఫామ్ హౌజ్ నుండి పరిపాలించడం అన్నిటికన్నా పెద్ద లోపం. దీన్ని లోపం అనడం కన్నా మానసిక రోగం అని చెప్పడం సరైనది. ఈ మాట ఇప్పుడు ఓడినవారు అధికారంలో ఉన్నప్పుడు చేసిన కృషి గురించి ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. వాళ్ళు ప్రజలకోసం కృషి చేశారు కనుకే ఇంతకాలం ప్రజలు గెలిపించారు. ఎంత కృషి చేశారో స్వయంగా నేనే వందకు పైగా వ్యాసాలు, ఐదు పుస్తకాలు ప్రచురించాను. ఏమి చేయలేదో, ఎక్కడ పొరపాట్లు చేశారో కూడా యాభైకి పైగా వ్యాసాలు రాశాను. కేసిఆర్ కు స్వయంగా పలు సూచనలు చేశాను. గురువుగా (గురువు అనే మాట నచ్చనివారికి సలహాదారుడిగా ) చెప్పడం నా ధర్మం. స్వీకరించడం, స్వీకరించకపోవడం వారి ఇష్టం. వారి ఇష్టప్రకారమే నడిచారు. నేను పెట్టిన ప్రతి వాట్సప్, ప్రతి వ్యాసం కేసిఆర్ కుకేటిఆర్ కు వినోద్ కు వారి సిబ్బందికి వెంటది వెంట ఫార్వర్డ్ చేశాను. వారు మారదలుచుకున్న మేరకు మారారు. మారాల్సినంతగా మారలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అలుపెరుగని రేవంత్ రెడ్డి

క్యూబా విప్లవంలో పాల్గొన్న చేగువేరా ఒక మాట అంటాడు. " విప్లవ పరిస్థితులు ఎపుడూ ఉంటాయి. కావలసిందల్లా సమర్థవంతమైన వాయకత్వమే". ఇది అక్షరాలా నిజం. రాహుల్ గాంధీ తనను తాను ఎదిగించుకొని పర్యటనలు చేయడం, రేవంత్ రెడ్డి పాదయాత్రలు ప్రసంగాలు , అధ్యయనం కేసీఆర్ కు దీటుగా ఎదగడం వల్ల ప్రజలు విశ్వసించారు. పుట్టిన్నించి కాంగ్రెస్ లో ఉన్నట్టుగా కాంగ్రెస్ ను రాజకీయాల చరిత్రను మలుపులను అవగాహన చేసుకున్నారు. దాంతో ఎవరూ అందుకోలేని ఎత్తులకు ఎదిగారు. ఆశయాల సాధవకై అలుపెరుగని పోరాట యోధులుగా అందర్ని కలుపుకొని విజయం సాధించారు. ఈ గెలుపులో పాల్గొన్న వర్గాల్లో నిరుద్యోగులు, యువత, గ్రామీణ కౌలు రైతులు, యాభై యేళ్ళుగా ఉద్యమాలతో సాధించుకున్న భూములు రైతుబంధు ధరణితో కోల్పోయిన పేద రైతులు అసైన్డ్ భూములుగా, ప్రభుత్వ భూములుగా మార్చబడిన పేద రైతులు, గల్ఫ్ కార్మికుల సమస్యలను గత ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చి కూడా ఏమాత్రం పట్టించుకోని నిర్లక్ష్యంతో ఓటు బ్యాంకుగా ఏర్పడిన గల్ఫ్ కార్మికులు, తెలంగాణ ఉద్యమకారుల్లో నావంటి వాళ్లను నాలుగోవంతు మాత్రమే తన వెంట కలుపుకొని కోదండరాం గద్దర్ వంటి మూడు వంతు ఉద్యమకారులను నిర్లక్ష్యం చేయడం,జరిగింది . ఉద్యమాలు చేసిన ఆర్టీసీ, టీచర్సు , సింగరేణి , ఎలక్ట్రిసిటీ తదితర ఉద్యోగ సంఘాలను నిర్వీర్యం చేయ ప్రయత్నించారు. వారు కాంగ్రెస్ ను ఆదరించారు. ఇలా పలు సెక్షన్లను శత్రువులుగా మార్చుకున్నారు. ఉద్యమకారులను వదిలేసి పచ్చి అవకాశవాద, తెలంగాణ వ్యతిరేక రాజకీయ శక్తులను కలుపుకొని విర్రవీగడం కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కలిపేసుకోవడం వంటి వాటి ద్వారా బురదలో రాయి వేసి దాటినట్టుగా కాలం గడుపుకుంటూ వచ్చారు. అది నిజమైన ప్రజాపరిపాలన కాకుండా పోయింది. ఉద్యమకారులను పూర్తిస్థాయిలో సామాజిక రాజకీయ రంగాల్లో గౌరవించి, వారి సేవలను సమాజానికి అందించేఅవకాశం ఇచ్చి ఉంటే స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ పార్టీ 1967 దాకా 20యేళ్ళపాటు కొనసాగినట్టుగా అధికారంలో కొనసాగి ఉండేది. తనకు తాను తనఇగోలకు, అహంకారానికి, స్వార్ధానికి, కులానికి, కుటుంబానికి సంపద కూడబెట్టడానికి పరిమితమై ఓట్లు ఎలా రాబట్టాలి అనేదానికి పరిమితమై సమగ్రకుటుంబ సర్వేతో వెల్లడి అయిన జనాభా గమనించి పెద్ద జనాభా గల కులాలకు

చేపలు, గొర్రెలు వంటి పథకాలు ముందుకు తెచ్చారు. ఆసరా పథకంలో చాలావర్గాలను కలిపారు. ఒంటరి మహిళలను, దివ్యాంగులను, బీడీ కార్మికులనుకూడా కలిపారు. ఇవి ఓటు బ్యాంకుగా పనికి వచ్చాయి. ఈ ఓటు బ్యాంకుమీదఆధారపడి విర్రవీగారు. ఈ విషయాన్ని నేను కరోనా కాలంలో చాలా వ్యాసాలురాసి ప్రత్యామ్నాయంగా ఎన్నికల మ్యానిఫెస్టోలు ఎలా ఉండాలో వందలాదివిషయాలు రాశాను. వాటిని స్వీకరించినవాళ్ళు స్వీకరించారు. అధికారంలరాదలచుకున్నవారు ఎక్కువ స్వీకరించారు. అలా స్థిరమైన ఓటు బ్యాంకు ఉండగా, దాన్ని అధిగమించి మెజారిటీ సాధించడానికి అదనంగా ఆరు గ్యారంటీలుకొత్త రూపంలో వచ్చిన ఎన్నికల మ్యానిఫెస్టో పైన పేర్కొన్న నూతన సామాజికవర్గాల ఓటు బ్యాంకులు ఎంతగానో ఉపయోగపడ్డాయి. వీరి కోరికలను తీర్చడంఅత్యవసరం. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరిధి నుంచి అనేక ఉద్యోగాలను తొలగించి జిల్లా కలెక్టర్ డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీకి అప్పగించి ఉగాదిలోగా రెండు లక్షల పోస్టులను నింపడం అవసరం. లక్షదాకా ఉన్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా కనీసం పదివేలు పెంచి ఆదరించడం అవసరం. వారికి రెగ్యులర్ పోస్టులలో ఎన్నిక కావడానికి 10 శాతం గ్రేస్ మార్కులు అనుభవానికి ఇవ్వడం అవసరం. ఉపాధ్యాయులను వెంటనే నియమించడం అవసరం. కొత్త జోనల్ సిస్టం వల్ల జరిగిన అన్యాయాలను సరి చేయడానికి ఉపాధ్యాయ సంఘాల నాయకత్వంలో ఆప్షన్స్ ప్రకారం సీనియారిటీతో పాటు వారు కోరుకున్న చోటుకి బదిలీ చేయడం అవసరం. ప్రమోషన్లను వెంటనే ఇవ్వడం అవసరం. అన్ని కాలేజీలలో, యూనివర్శిటీలలో ఖాళీలను ఆరు నెలల్లోగా నింపడం ద్వారా ఉన్నత విద్యావంతులైన యువకులకు యాభై వేల ఉద్యోగాలు లభిస్తాయి. ఉగాది వరకు రెండు లక్షలకు తగ్గకుండా మూడు లక్షలదాకా ఉద్యోగాలను నియమించడం సాధ్యమే. గల్ఫ్ కార్మికుల కోసం వెంటనే వెయ్యి కోట్లతో ఒక నిధి ఏర్పాటు చేయడం తక్షణ కర్తవ్యం. ధరణి, రైతుబంధులో జరిగిన అవకతవకలు నిర్ధారించేదాక కొద్దిరోజులు నిలిపివేయడం అవసరం. కుల గణన వెంటనే చేపట్టడం ద్వారా రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఒక గొప్ప సూచన ఇచ్చి జాతీయ స్థాయిలో గెలవడానికి బాట వేసుకోవడం మరిచి పోరాదు. కేంద్రంలో కాంగ్రెస్ ఓడిపోవడం ద్వారా కాంగ్రెస్ కన్నా దేశం ఎంతో నష్టపోయింది. ఈ విషయం గ్రహించిన సామాజిక వర్గాలను కలుపుకొని ముందుకు సాగడం అవసరం.

**బి ఎస్ రాములు**

# ఆందోళన కలిగిస్తున్న ఐటీ సంక్షోభం

ఇంజినీరింగ్‌లో సబ్జెక్ట్ ఏదైనా అంతిమంగా ఐటీ జాబ్‌కే అందరూ గురిపెట్టడం మనదేశంలో రివాజుగా మారింది. పట్టా పుచ్చుకుని కాలేజీ నుంచి బైటకు రాగానే ఏదో ఒక టెక్ కంపెనీలో చేరిపోవచ్చనే ధీమా అందుకు కారణం. ఐటీ జాబ్ వస్తే స్థిరమైన కెరీర్‌కు బాటలు పడుతాయి. చక్కటి జీతంతో కార్పొరేట్ జీవితం గడపొచ్చని అనుకోవడం సహజమే. కానీ ప్రస్తుతం ఎంట్రీలెవెల్ జాబ్స్ క్రమంగా తగ్గిపోతున్నాయి. ఈసారి రిక్రూట్‌మెంట్లు పూర్తిగా డోలాయమాన స్థితిలో పడిపోవడంతో వేలమంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. గ్లోబల్ డిమాండ్ తగ్గిపోవడంతో అనేక కంపెనీలు ఫ్రెషర్స్‌ను తీసుకోవడం నిలిపివేశాయి. వాటిలో ఇన్ఫోసిస్, విప్రో వంటి టెక్ దిగ్గజాలు ఉండటం గమనార్హం. మన దేశానికి ఉపాధి కల్పించే రంగాల్లో ఐటీ వాటా 7.5 శాతం వరకు ఉంటుంది. ఐటీ ఉద్యోగాలు పుట్లకొద్దీ చూసిన మనదేశంలో జాబ్స్ కొరత అసాధారణమైన విషయమే. అయితే ఇది కేవలం ఫ్రెషర్స్ సమస్య మాత్రమే కాదు. లక్షల కోట్ల పరిశ్రమలో ఏర్పడుతున్న సంక్షోభానికి ఇది ఒక సూచనగా నిలుస్తుంది. భారతదేశ వృద్ధిపై ప్రభావం చూపి, భారత ఆర్థిక వ్యవస్థను మూడు లక్షల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకువెళ్లాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు ఇది గండి కొట్టే అవకాశం ఉన్నది. కరోనా కల్లోలం ప్రధానంగా ఉద్యోగాలకు గండిపెట్టింది. అయితే గత రెండేండ్లలో పరిస్థితి మెరుగుపడి ఐటీ కంపెనీలు భారీస్థాయిలో రిక్రూట్‌మెంట్ జరిపాయి. వర్క్ ఫ్రం హెూం పద్ధతి రావడం కూడా ఇందుకు దోహదం చేసింది. అగ్రస్థాయి కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ దాదాపు 3 లక్షల మంది ఫ్రెషర్స్‌ను తీసుకున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం వల్ల ప్రపంచంలో అస్థిర పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రపంచ ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెరుగుదల దానికి ఆజ్యం పోశాయి. ఫలితంగా ఐటీ సేవలను ఉపయోగించుకునే కంపెనీలు ఖర్చులను తగ్గించే పనిలో పడ్డాయి. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత సాధించిన అభివృద్ధి కూడా ఫ్రెషర్స్ ఉద్యోగాలు తగ్గడానికి కారణమవుతున్నది. దీంతో కొత్త ఉద్యోగులను తీసుకోవడం భారీగా తగ్గిపోయింది. నిరుడుతో పోలిస్తే ప్రెషర్స్ రిక్రూట్‌మెంట్ మొన్నటి సెప్టెంబర్‌లో 43 శాతం, అక్టోబర్‌లో 14 శాతం తగ్గింది. క్రమం తప్పకుండా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ జరిపే పెద్దపెద్ద కంపెనీలు ఈ ఏడాది ముఖం చాటేశాయి. గత అక్టోబర్‌లో ఒక అంచనా ప్రకారం నిరుద్యోగం 10.05 శాతానికి పెరిగింది. ఐటీలో మాంద్యం వస్తే దాని ప్రభావం ఇతర రంగాలపైనా ఉంటుందనేది తెలిసిందే. ఎన్నికల వేళ ప్రధాని నరేంద్రమోదీకి ఇదొక తలనొప్పిగా మారవచ్చు. ఎందుకంటే కేంద్ర విపక్షాలు దీనిపై హంగామా చేయకుండా ఉంటాయని భావించలేం. నిరుద్యోగులు ఆందోళన బాట పడితే సమస్య చేయిదాటిపోయే ప్రమాదమూ ఉంటుంది. దీనిని పసిగట్టే ప్రధాని మోదీ స్వయంగా ఉపాధి మేళాలకు వచ్చి నియామక పత్రాలు అందజేస్తూ ఇమేజ్ కాపాడుకునేందుకు తంటాలు పడుతున్నారు. ఈ రాజకీయ వ్యవహారాన్ని పక్కన బెడితే ఐటీ రంగాన్ని ప్రస్తుత సంక్షోభం నుంచి బైటపడేసే చర్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది. సీనియర్లతో కిందిస్థాయి పనులు చేయించడం మానుకొని ఫ్రెషర్స్‌కు అవకాశాలు కల్పించడం అనేది దిద్దుబాటు చర్యల్లో ముఖ్యమైంది.

# ఘనంగా బహుజన సేన లోగో ఆవిష్కరణ

ఏలూరు, ప్రజాపాలన ప్రతినిధి : కుల మతాలకు అతీతంగా ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడం తమ భాద్యతగా బహుజన సేన పనిచేస్తుందని రెవరెండ్ ఫాదర్ పి. బాల తెలిపారు.




స్థానిక ఎన్ ఆర్ పేటలోని లేడీస్ క్లబ్ నందు బహుజన సేన ముఖ్య నాయకుల సమావేశం మరియు కమిటీ నియామకం అత్యంత వైభవంగా బహుజన సేన వ్యవస్థాపక అధ్యక్షులు మత్తే బాబి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెవరెండ్ ఫాదర్ బాల, ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరమ్ అధ్యక్షులు రేగులగడ్డ మని సింగ్, హైకోర్టు న్యాయవాదులు దోడిగర్ల సుమలత, గంటా రాజశేఖర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన బహుజన సేన లోగో ను వారు ఆవిష్కరించారు. అనంతరం ఫాదర్ పి.బాల మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు శ్రామికులు కనుకనే బహుజనులంటారన్నారు. అటువంటి శ్రామిక వర్గాన్ని అన్ని విధాలా ఆదుకోవాల్సిన వివిధ రాజకీయ పార్టీలు వారిలో కులతత్వాన్ని నింపుతున్నాయన్నారు. అశాస్త్రీయ విధానాలు అంతిమంగా శ్రామిక ప్రజల అనైక్యతకు, దోపిడీ వర్గం ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నాయన్నారు. అటువంటి శ్రామిక ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడమే తమ భాద్యతగా బహుజన సేన పని చేయడం అభినందనీయమన్నారు. తదుపరి రేగులగడ్డ మని సింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే వంటి సామాజిక ఉద్యమకారుల పట్ల, సామాజిక ఉద్యమాల పట్ల గౌరవభావం ఉండాలన్నారు. సామాజిక సంస్కర్తలలో బహుజన సేన మహిళల స్థితిగతులు వారి హక్కులపై ప్రత్యేక దృష్టి కనబర్చాలన్నారు. ఈ కాలంలో సామాజిక, రాజకీయ ఆలోచనాపరులు మహిళల స్థితిని పెంపొందించే లక్ష్యంతో ఉద్యమాలను చేపట్టాలన్నారు. గత కొంత కాలంగా బహుజన సేన దృష్టికి వస్తున్నా ప్రతి సమస్యను పరిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. బహుజనుల సమస్యలకు పరిష్కార వేదికగా బహుజన సేన ను ముఖ్య నాయకులు సమావేశం మరియు కమిటీ నియామకం నేడు నిర్వహించడం శుభపరిణామమన్నారు. అనంతరం పలువురు అతిథులు బహుజన సేన వ్యవస్థాపక అధ్యక్షులు మత్తే బాబీ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కందుల రమేష్,మత్తే కుమార్, హాజీ ఆరిఫ్, తేజ ప్రవీణ్, పిట్టా రాహుల్, వేల్పుల సుందరం, ఎం.పరమేశ్వరరావు, విజయకుమారి, కాపుదశి రవికుమార్, ఆకుల దుర్గాప్రసాద్, మాస శివయ్య , తదితరులు పాల్గొన్నారు

# మిచౌంగ్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

**టిడిపి బాపట్లపార్లమెంటు అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**

**నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి విస్తృత పర్యటన,- రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలవాలి**



పర్చూరు, డిసెంబర్ 04, ప్రజాపాలన : మిచౌంగ్ తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. సోమవారం పర్చూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా పలువురు రైతులతో మాట్లాడి, పంటల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ, మిచౌంగ్ తుఫాను మంగళవారం, బాపట్ల సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని, వాతా వరణ శాఖ అధికారులు చెప్తున్నారని ప్రజలందరూ సురక్షితంగా ఉండాలన్నారు. ఈ తుఫానుకు గంటకు 110 కి.మీ.వేగంతో గాలులు వచ్చే అవకాశం ఉందని, అధికారులు చెబుతున్నారని ప్రజలందరూ రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.తుఫాను ప్రభావంతో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. తుఫాను ప్రభావంతో బాపట్ల జిల్లా వ్యాప్తంగా, శనగ, మిరప, ప్రత్తి, వైట్ బర్లి పంటలు దెబ్బతినే అవకాశం ఉందని, అధికారులు రైతాంగానికి సూచనలు అందించాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.అధికశాతం నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, త్రాగు నీరు, శాని టేషన్ పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

– నియోజకవర్గంలో విస్తృత పర్యటన...

నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి విస్తృతంగా పర్యటించారు. యద్దనపూడి మండలం చింతపల్లిపాడులో అయ్యప్ప ఇరుముడి కార్యక్రమంలో పాల్గొని, పూజాకార్యక్రమం నిర్వహించారు. పర్చూరు, గోరంట్లవారిపాలెం గ్రామాలలో, ఇటీవల మరణించినవారి కుటుంబాలను, అనారోగ్యం తో బాధపడుతున్న పలుకుటుంబాలను పరామర్శించి, పలు కుటుంబాలకు బాసటగా నిలిచారు. చింతపల్లిపాడు మహేష్ నివాసంలో,అయ్యప్ప స్వామి ఇరుముడి కార్యక్రమంలో పాల్గొని, పూజలు నిర్వహించారు.పర్చూరు నెహ్రూకాలనీకి చెందిన సయ్యద్ సుభాని మరణించగా, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. పర్చూరుకు చెందిన నరాలశెట్టి కృష్ణ సతీమణి దుర్గమ్మ సంస్మరణ కార్యక్రమానికి హాజరై, ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. పర్చూరు అంబేద్కర్ కాలనీ చెందిన ఆర్టీసీ డ్రైవర్ దేవరపల్లి నల్లయ్య పార్థివదేహానికి నివాళులర్పించారు. గోరంట్లవారిపాలెం గ్రామానికి చెందిన తొలి గ్రామ సర్పంచ్ సూరాబత్తిని రామయ్యను పరామర్శించారు. గోరంట్లవారిపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ గ్రామశాఖ అధ్యక్షులు సింగు శ్రీనివాసరావును పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఏలూరి వెంట, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులలో ఆణిముత్యం మాజీముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ కొణిజేటి రోశయ్య: తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీను



చీరాల, డిసెంబర్ 04, ప్రజాపాలన : ఆర్యవైశ్యులలో ఆణిముత్యం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ స్వర్గీయ డాక్టర్ కొణిజేటి రోశయ్య, చీరాల నియోజకవర్గ అభివృద్ధికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీను అన్నారు. స్వర్గీయ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా,చీరాల మహాత్మాగాంధీ క్లాత్‌మార్కెట్ వద్ద వున్న, కొణిజేటి రోశయ్య విగ్రహానికి పూలమాలలువేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణఅధ్యక్షులు గజవల్లి శ్రీను మాట్లాడుతూ,ముఖ్యమంత్రి గా, గవర్నర్‌గా, ఇతర పలు ఉన్నత పదవులు అధిరోహించి, ఆయా పదవులకే వన్నెతెచ్చిన ఘనత రోశయ్యదేనన్నారు.రాష్ట్ర అభివృద్ధికి, ప్రత్యే కించి చీరాలనియోజకవర్గ అభివృద్ధికి రోశయ్య చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, టిడిపి పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీను, జి.సాయి, చుండూరి రాంప్రసాద్, సాతులూరి మల్లికార్జునరావు, పూర్ణచంద్రరావు, కొండు రత్నబాబు,అయ్యో ఖాన్,మోహిదిన్, తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తుఫాను ముప్పును ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం: కలెక్టర్ పి. ప్రశాంతి



నరసాపురం, డిసెంబర్ 4 (ప్రజాపాలన ప్రతినిధి) :తుపాను కారణంగా జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో సోమ వారం నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రామ సుందర్ రెడ్డి, ఆర్డీవో ఎం అచ్యుత అంబరీష్, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలెక్టర్ పి ప్రశాంతి సమావేశం నిర్వహించారు. బంగాళా ఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుపాను బాపట్ల, మచిలీ పట్నంల మధ్య తీరాన్ని దాటే అవకాశముందని వాతా వరణ శాఖ తెలిపిన ఈనేపథ్యంలో జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మండలాల్లో అత్యవసరంగా 12 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసామని ఆరుగురు గర్భిణీ స్త్రీలను ప్రభుత్వ వైద్యశాలలకు తరలించామని తెలిపారు. భారీవర్షాల సూచనతో లోతట్టు, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను యుద్ధ ప్రాతిపదికన తరలించాలని పునరావాస కేంద్రాలలో తాగునీరు, భోజనం తదితర మౌలిక సదుపాయాల కొరతరాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎన్డీ ఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని గజ ఈతగాళ్లు, మెకనైజ్డ్ బోట్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. విపత్తు అనంతరం మండల స్థాయిలో తక్షణ పునరుద్ధరణ కార్యక్రమాల నిర్వహణకు బృందాలను నియమించామని కలెక్టర్ తెలిపారు. తీర ప్రాంతాలైన ఆచంట, నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలలోని అధికారులు మరింత అప్ర మత్తంగా ఉండాలని ఆమె ఆదేశించారు. రహదారులపై చెట్లు కూలితే తక్షణమే తొలగించడానికి కటింగ్ యంత్రాలు, జెసిబిలు, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణకు బృందాలు చర్యలు తీసుకోవాలన్నారు. రవాణాశాఖ, ఆర్ అండ్ బి, విద్యుత్, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, పంచాయతీరాజ్, ఎంపీడీవోలు బృందంలో ఉంటారని ఆమె తెలిపారు. పునరావాస కేంద్రాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అన్ని మందులతో పాటు కాటు మందులు కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆయా కేంద్రాలలో పారిశుధ్యం, వైద్యం కొరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. భారీ వర్షాలు కురిస్తే ఆహార పంటలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 85,264 హెక్టార్లలో వరి పంట సాగుచేయగా 30,652 వేల హెక్టార్లలో ధాన్యం పంట కోయడం జరిగిందని మిగిలిన 54,611 వేల హెక్టార్లలో వరి పంట సుమారు 10 రోజులలో కోతదశకు చేరుతుందని తెలిపారు. ఇప్పటివరకు 1,15,483 టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, 48, 266 టన్నుల ధాన్యం బహిరంగ మార్కెట్లో రైతులు అమ్మడం జరిగిందని అన్నారు. 9,700 టన్నుల ధాన్యం సురక్షిత ప్రాంతాలలో భద్రపరచడం జరిగిందని ఇంకా బయటవున్న 8,456 టన్నుల ధాన్యాన్ని తరలించడానికి సిద్ధం చేయడం జరిగిందన్నారు. పొలాలలో నీరు నిల్వ లేకుండా దిగువ ప్రాంతాలకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉద్యానవన పంటలకు కూడా నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగాఉండాలని కలెక్టర్ సూచించారు.

అనంతరం నరసాపురం మండలం లోని పెదమైనవాని లంక డిజిటల్ భవనం, పిఎం లంకలో సముద్రం కోతకుగురైన ప్రాంతాన్ని, చినమైనవాని లంక తుఫాన్ షెల్టర్, వేములదీవి తూర్పు తుఫాన్ షెల్టర్, బియ్యపుతిప్ప ఫిషింగు హార్బర్, కాలనీ ప్రాంతాలను జిల్లా కలెక్టరు పి ప్రశాంతి జిల్లా జాయింటు కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి, ఆర్డీవో ఏం.అచ్యుత అంబరీష్, వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి తుఫాను ప్రభావాన్ని పరిశీలించారు.

నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకుంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలకు మీ కలం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలనుకుంటున్నారా? ఇంకెందుకు ఆలస్యం...?
మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి....
జాతీయ తెలుగు దినపత్రిక ప్రజాపాలన
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా, మండలాల వారీగా విలేకరులను ఆహ్వానిస్తుంది
అర్హత : నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగే సత్తా ఉండాలి
వివరాలకు ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి..:
సెల్ : 8886022523, 9000621111,9848725373

జాతీయ తెలుగు దినపత్రిక ప్రజాపాలన దినపత్రికలో
పుట్టినరోజు / ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు రూ. 500
కోర్టు నోటీసులు / పబ్లిక్/ కంపెనీస్ నోటీసులు రూ. 600
Contact : 8886022523, 9000621111, 9948725373

జాతీయ తెలుగు దినపత్రిక ప్రజాపాలన దినపత్రికలో
మంత్లీ అడ్వర్టైజ్‌మెంట్స్
4x5. Rs. 13,000/- p.m.
8x10. Rs. 24,000/- p.m.
12x10. Rs. 36,000/- p.m.
5 లైన్ల క్లాసిఫైడ్ యాడ్ రూ. 5000/- p.m.
Quarter Page (16x20) Ad (1st Page) Rs. 96,000/- p.m.
Contact : 8886022523, 9000621111, 9948725373

కావలెను
స్నేహ గ్రూప్, హైదరాబాద్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
నెలకు రూ.15,000/- జీతం,
ట్రావెలింగ్ అలవెన్సు, ఇన్సెంటివ్ ఇవ్వబడును.
ఆసక్తి గలవారు మీ వివరాలని
ఈ క్రింది నెంబర్ కి వాట్సాప్ చేయగలరు.
7660027683, 91549 58315

SNEHA MACS LTD Ph : 7660027682
"THE SNEHA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED"
స్నేహ మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్
మీ డిపాజిట్ 7 సం॥లకే రెట్టింపు (Double)
మీ మనవళ్ళకు మరియు మనవరాళ్ళకు చదువుకు, పెళ్ళికోసం కానుకగా
5 సం.ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 12% వడ్డీ
గత 20 సం॥లుగా సమాజ మార్పు కోసం కంపెనీకి వచ్చే లాభాలను పేద ప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ SOCIAL ENGINEERING చేస్తున్నాం
H.NO. NO. 6-2-19/3/12, 3rd Floor, Doulat Plaza, Lakdikapool, Hyderabad, Telangana.
Email : snehamacsltd@gmail.com

స్నేహ పెండ్లిపిలుపు
స్నేహ మ్యారేజ్ బ్యూరో
వివరాలకు :
https://snehapellipilupu.com/
9154958315

SNEHA MACS LTD Ph : 040-23233989
"THE SNEHA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED"
Regd. No. TS/ DCO/HYD/MACS/2017?314 Dt 30th May 2017
స్నేహ పెన్షన్ స్కీమ్
చేరండి ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
01 జనవరి 2021 నుండి 7 సం॥ల పాటు డిపాజిట్ చేసిన వారికి డబుల్ ఎమౌంట్ ఇవ్వబడును
సంవత్సరానికి 11% వడ్డీ ఇవ్వబడును
మీ డిపాజిట్ లభించే వడ్డీ
రూ. 1,00,000/- రూ. 11,000/-
రూ. 5,00,000/- రూ. 55,000/-
రూ. 10,00,000/- రూ. 1,10,000/-
మీ మనవళ్ళకు మరియు మనవరాళ్ళకు చదువకు, పెళ్ళికోసం కానుకగా
మీ డిపాజిట్ 7 సం॥లకే రెట్టింపు (Double)
డాక్టర్ కె. శివభాగ్యారావు IRS, VRS చైర్మన్
ఎస్. రామకృష్ణ మ్యాక్స్ ప్రెసిడెంట్, సెల్: 9133312134

bahujan bazaar
మీరు కోరుకున్న పుస్తకాలు / ప్రొడక్ట్స్ మీ ఇంటికి వద్దకే చేర్చే ఆన్లైన్ షాపింగ్
To Order Visit : www.bahujanbazaar.in
Contact No. : 8886022523

# హోమ్ మంత్రి పదవి కోసం కర్చీఫ్‌లు!

గుంటూరు, డిసెంబర్ 4 : తెలుగుదేశం పార్టీలో హోం మంత్రి పదవికి చాలామంది ఎదురుచూస్తున్నారు. తమ మనసులో ఉన్న మాటను బయట పెట్టేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని.. జనసేనతో పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని.. ఆ ప్రభుత్వంలో తాము హోం మంత్రిగా పదవీ బాధ్యతలు చేపడతామని అర్థం వచ్చేలా చాలామంది మాట్లాడుతున్నారు. తాజాగా యువ నాయకుడు నారా లోకేష్ ఇదే అర్థం ధ్వనించేలా మాట్లాడారు. ఏ ఒక్కరినీ విడిచి పెట్టమని.. తమను ఇబ్బంది పెట్టిన వైసీపీ నేతలకు రిటర్న్ గిఫ్ట్ ఖాయమని చిన్న బాబు హెచ్చరించడంతో.. ఆయన త్వరలో హోం మంత్రి పదవి తీసుకుంటారని టిడిపి వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వంలో ముఖ్యమంత్రి తర్వాత హోం శాఖ కీలకమైనది. ఇది అన్ని శాఖల సమాహారం. సర్వ హక్కులు ఉంటాయి ఈ శాఖకు. అందుకే ప్రభుత్వ అధినేతలు హోం మంత్రిత్వ శాఖను కేటాయించేటప్పుడు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుంటారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలిమినేటి మాధవరెడ్డి, దేవేందర్ గౌడ్ లాంటి నేతలు హోం మంత్రులుగా ఉండేవారు. ఒకానొక దశలో వీరు చంద్రబాబుకు బీట్ అవుట్ చేయడానికి ప్రయత్నించారన్న కామెంట్స్ ఉన్నాయి. అందుకే 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తనకు నమ్మకస్తుడైన నిమ్మకాయల చినరాజప్పను హోం మంత్రిగా అవకాశం ఇచ్చారు. 2019లోవైసిపి అధికారంలోకి వచ్చింది. జగన్ సీఎం అయ్యారు. కొంతమంది సీనియర్లను క్యాబినెట్ లోకి తీసుకున్నారు. కానీ హోం మంత్రి విషయంలో మాత్రం ముందు జాగ్రత్తగా ఆలోచన చేశారు. తనకు అత్యంత నమ్మకస్తురాలైన మేకతోటి సుచరితకు హోం మంత్రి బాధ్యతను అప్పగించారు. మొన్నటి మంత్రివర్గ విస్తరణలో సైతం తానేటి వనితకు ఆ పదవి ఇచ్చారు. పేరుకే వారు మంత్రులు కానీ.. అధికారమంతా సీఎం జగన్ వద్ద ఉందన్నది బహిరంగ రహస్యమే. అయితే అటువంటి పదవి కోసం టిడిపి నేతలు ఆశలు పెట్టుకోవడం విశేషం. టిడిపి అధికారంలోకి వస్తే తానే హోం మంత్రి పదవి చేపడతానని.. అందరి లెక్క తేలుస్తానని గతంలో కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పుకొచ్చారు. అటు తరువాత మరో సీనియర్ నాయకుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు సైతం ఇదే తరహా హెచ్చరికలు జారీ చేశారు. ఇంతలో గంటా శ్రీనివాసరావు సైతం హోం మంత్రి పదవి అయితే తనకు సూట్ అవుతుందని భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు లోకేష్ ఇదేవిధంగా వ్యాఖ్యలు చేయడం విశేషం. ముఖ్యమంత్రి తర్వాత అంతటి పవర్ ఫుల్ పదవి అయిన హోం మంత్రిత్వ శాఖను లోకేష్ కి ఇస్తే కూటమి ప్రభుత్వంలో ఇబ్బందులు తప్పవు.

ఇంకా జనసేనకు సీట్లు సర్దుబాటు చేయాలి. మంత్రి పదవులు కేటాయించాలి. ఇన్ని రకాల కసరత్తులు జరగాల్సి ఉన్న తరుణంలో హోం మంత్రి పదవి గురించి చర్చ తగునా అని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. అటువంటి ఆశలు విడిచిపెట్టి ముందు పార్టీ విజయానికి పాటుపడాలని టిడిపి శ్రేణులు సూచిస్తున్నాయి

## త్వరలోనే ఎన్‌టీఆర్ స్టేడియం కమిటీ ఎన్నికలు



గుడివాడ : నేటితో ముగిసిన గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం పాలక కమిటీ పదవీ కాలం. త్వరలో జరగనున్న ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని కమిటి సభ్యులు తెలిపారు. సోమవారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమిటీ వైస్ చైర్మన్ పాలేటి చంటి, సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్‌లు మాట్లాడుతూ గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం పాలక కమిటీ పదవీకాలం సోమవారంతో ముగిసిందన్నారు. మూడేళ్ల పదవీకాలంలో తమకు సహకరించిన ప్రతి ఒక్కరికి స్టేడియం కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. స్టేడియం కమిటీలో తమకు అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే కొడాలి నానికు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో స్టేడియం కమిటీ సభ్యులు బొగ్గరపు తిరుపతయ్య, వల్లభనేని ప్రసాద్, కిలారపు రంగ ప్రసాద్, తదితరులు, పాల్గొన్నారు.

## జనసేనకు దక్కని టీడీపీ సపోర్ట్..

గుంటూరు, డిసెంబర్ 4 :ఏపీలో తెలుగుదేశం పార్టీతో జనసేన పొత్తు పెట్టుకుంది. అవినీతి కేసుల్లో చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండగా పవన్ పరామర్శించారు. నేరుగా జైలు నుంచి బయటకు వచ్చి తెలుగుదేశం పార్టీతో పొత్తు ప్రకటన చేశారు. తెలంగాణ ఎన్నికల ఫలితాలతో తెలుగు రాజకీయాలు స్పష్టంగా వెలుగు చూశాయి. కాంగ్రెస్ స్పష్టమైన మెజారిటీ వెనుక బీఆర్ఎస్ వైఫల్యాలతో పాటు ఎన్నో రకాల కారణాలు ఉన్నాయి. అందులో ప్రధానమైనది టిడిపి సపోర్ట్. చంద్రబాబు నుంచి ఎటువంటి ప్రకటన రాకున్నా? తెలుగుదేశం పార్టీ శ్రేణులు మాత్రం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపాయి. ఈ విజయానికి ముమ్మాటికి తెలుగుదేశం పార్టీతో పాటు చంద్రబాబు కారణమన్న విశ్లేషణలు ప్రారంభమయ్యాయి. దీంతో పాటు జనసేన అధినేత పవన్ వెన్నుపోటుకు గురయ్యారు అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఏపీలో తెలుగుదేశం పార్టీతో జనసేన పొత్తు పెట్టుకుంది. అవినీతి కేసుల్లో చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండగా పవన్ పరామర్శించారు. నేరుగా జైలు నుంచి బయటకు వచ్చి తెలుగుదేశం పార్టీతో పొత్తు ప్రకటన చేశారు. ఒక మిత్రుడిగా చేయాల్సిందంతా చేశారు. పొత్తు విచ్చిన్నానికి వైసీపీతో పాటు మరికొన్ని శక్తులు ప్రయత్నించినా ఎక్కడా వెనక్కి తగ్గలేదు. తెలంగాణ ఎన్నికల పోలింగ్ ముంగిట.. ఏపీలో జనసేన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. టిడిపితో పొత్తు విషయంలో పవన్ చిత్తశుద్ధితో మాట్లాడారు. ఎక్కడా టిడిపిని తగ్గిస్తూ మాట్లాడలేదు. అయినా సరే తెలంగాణలో టిడిపి శ్రేణులు జనసేన వైపు మొగ్గు చూపక పోవడం దారుణం. తెలంగాణలో బిజెపితో జనసేన పొత్తు పెట్టుకుంది. పొత్తులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసింది. గ్రేటర్ లో కూకట్పల్లి తో పాటు ఖమ్మం జిల్లాలో మెజారిటీ స్థానాలను జనసేనకు కేటాయిస్తూ బిజెపి నిర్ణయించింది. అయితే ఈ సీట్ల కేటాయింపు కూడా టిడిపి సహకరిస్తుందన్న ఉద్దేశంతో విడిచిపెట్టినవే. కూకట్ పల్లి లో కమ్మ సామాజిక వర్గంతో పాటు సెటిలర్స్ అధికం. అటు ఖమ్మంలో సైతం కమ్మ సామాజిక వర్గం ప్రాబల్యం ఎక్కువ. వీరంతా జనసేనకు సపోర్ట్ చేస్తారని భావించి బిజెపి అక్కడ సీట్లు కేటాయించింది. ఏపీలో పొత్తు ఉండడంతో తెలుగుదేశం పార్టీ సైతం పరోక్షంగా మద్దతు తెలుపుతుందని భావించారు. కానీ అందుకు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీకి ఏకపక్షంగా కమ్మ సామాజిక వర్గం మద్దతు తెలపడం విశేషం. చంద్రబాబు ఎటువంటి ప్రకటన చేయకపోయినా.. టిడిపి శ్రేణులకు మాత్రం అంతర్గతంగా సమాచారం వెళ్ళినట్టు తెలుస్తోంది. అయితే పొత్తులో ఉన్నందున జనసేన పోటీ చేసిన ఆ ఎనిమిది స్థానాలు విషయంలో టిడిపి ఎటువంటి ఆలోచన చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. కనీసం ఆ ఎనిమిది చోట్ల జనసేన అభ్యర్థులకు మద్దతు తెలిపి ఉంటే బాధ్యతగా ఉండేది అని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తెలంగాణ ఎన్నికల్లో టిడిపి పోటీ చేయలేదు. మిత్రపక్షంగా ఉన్న జనసేన పోటీ చేసింది. ఇటువంటి పరిస్థితుల్లో తప్పకుండా మద్దతు తెలపాల్సిన బాధ్యత టిడిపి పై ఉంది. కానీ చంద్రబాబు ఇక్కడే తన ఆలోచనకు పదును పెట్టారు. తెలంగాణలో జనసేనకు దెబ్బ కొడితే.. ఏపీలో సీట్ల పరంగా పార్టీ నుంచి డిమాండ్ ఉండదని భావించారు. అందుకే జనసేన అభ్యర్థులకు టిడిపి నుంచి ఎటువంటి సహకారం అందకుండా చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది పవన్ కు వెన్నుపోటు పొడవడమేనన్న కామెంట్స్ జనసేన నుంచి వినిపిస్తున్నాయి. చంద్రబాబుకు ఈ తరహా రాజకీయాలు అలవాటేనని.. అందుకే పవన్ ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిదని అభిమానులు సలహా ఇస్తున్నారు. కానీ తెలుగుదేశం పార్టీతో పొత్తు విఘాతం కలిగించే వ్యాఖ్యలు చేయవద్దని ఇప్పటికే పార్టీ శ్రేణులకు పవన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధినేతకు చెప్పేందుకు పార్టీ శ్రేణులు సాహసించలేకపోతున్నారు. వెన్నుపోటు అని తెలిసినా పవన్ నోరు మెదపకపోవడంపై అంతర్మధనం చెందుతున్నారు.

## 23 నుంచి 1 వరకు వైకుంఠ దర్శనం

తిరుమల, డిసెంబర్ 4, :వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది డిసెంబరు 23 నుండి జనవరి 1వ తేదీ వరకు 10 రోజుల పాటు భక్తులకు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. భక్తులు క్యూలైన్లలో చలికి ఇబ్బందులు పడుతూ ఎక్కువ సమయం వేచి ఉండడాన్ని నివారించేందుకు టైంస్లాట్ టోకెన్లు జారీ చేస్తున్నామని చెప్పారు.

ఆన్‌లైన్ దర్శన టికెట్ల వివరాలు

"2.25 లక్షల రూ.300/- ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లను నవంబరు 10న ఆన్‌లైన్‌లో విడుదల చేశాం.

-రోజుకు 2000 టికెట్లు చొప్పున శ్రీవాణి దర్శన టికెట్లు, గదుల కోటాను కూడా నవంబరు 10న ఆన్‌లైన్‌లో విడుదల చేశాం. ఆఫ్‌లైన్‌లో స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల వివరాలు

తిరుపతి, తిరుమలలోని 10 కేంద్రాలలో 94 కౌంటర్ల ద్వారా డిసెంబరు 22 నుండి మొత్తం 4,23,500 టోకెన్లు మంజూరు చేస్తాం. తిరుపతిలోని ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణునివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, శ్రీ గోవిందరాజస్వామి రెండో సత్రం, బైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిరుమలలో స్థానికుల కోసం కౌస్తుభం విశ్రాంతి గృహం వద్ద టోకెన్ కౌంటర్లు ఏర్పాటుచేస్తాం.

భక్తులకు విజ్ఞప్తిదర్శనటోకెన్లు గల భక్తులను మాత్రమే తిరుమల శ్రీవారి దర్శనానికి అనుమతించడం జరుగుతుంది. దర్శన టికెట్లు లేని భక్తులు తిరుమలకు రావచ్చు గానీ దర్శనానికి అనుమతించబడరు. భక్తులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరడమైనది.

శ్రీవారి ఆలయం డిసెంబరు 22 నుండి 24వ తేదీ వరకు, డిసెంబరు 31, జనవరి 1వ తేదీల్లో కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను రద్దు చేయడమైనది. ఈ సేవలను డిసెంబరు 25 నుండి 30వ తేదీ వరకు ఏకాంతంగా నిర్వహించడం జరుగుతుంది. డిసెంబరు 23 నుండి జనవరి 1వ తేదీ వరకు సహస్రదీపాలంకార సేవను ఏకాంతంగా నిర్వహిస్తాం. వైకుంఠ ఏకాదశి నాడు ఉదయం 9 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు స్వర్ణరథంపై ఆలయ నాలుగుమాడ వీధులలో భక్తులకు దర్శనమిస్తారు.

వైకుంఠ ద్వాదశి సందర్భంగా ఉదయం 4.30 నుండి 5.30 గంటల వరకు చక్రస్నానం నిర్వహిస్తాం. నాదనీరాజనం వేదికపై ఏకాదశి రోజున విష్ణుసహస్రనామ పారాయణం ఉంటుంది. అదేరోజు గీతాజయంతి రావడంతో భగవద్గీతను కూడా అఖండపారాయణం నిర్వహిస్తాం. 2024వ సంవత్సరం డైరీలు, క్యాలెండర్లు తిరుమల, తిరుపతితోపాటు చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, వైజాగ్‌లోని శ్రీవారి ఆలయాలు, ముంబయి, న్యూఢిల్లీ, వేలూరు, కాంచీపురంలోని సమాచార కేంద్రాలు, నెల్లూరు, రాజమండ్రి, కాకినాడ, కర్నూలులోని టీటీడీ కల్యాణమండపాల్లో అందుబాటులో ఉన్నాయి. తిరుమలలో గదులు పొందిన భక్తులు కాషన్ డిపాజిట్ ప్రస్తుతస్థితిని తెలుసుకునేందుకు టీటీడీ వెబ్‌సైట్‌లో కాషన్ డిపాజిట్ రీఫండ్ ట్రాకర్‌ను పొందుపరిచాము. భక్తులు గది బుక్ చేసుకున్న మొబైల్ నంబరుతో వెబ్‌సైట్‌లో లాగిన్ అయి అకామడేషన్ ? బుకింగ్ హిస్టరీ ? ఆఫ్‌లైన్ అకామడేషన్ సిడి రీఫండ్ ట్రాకర్‌ను క్లిక్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు" అని టీటీడీ ఈవో ధర్మారెడ్డి చెప్పారు.

## మిచౌంగ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో,అధికారులు అప్రమత్తంగా ఉండాలి: బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ సిహెచ్. శ్రీధర్

చీరాల, డిసెంబర్ 04, ప్రజాపాలన : మిచౌంగ్ తుఫాన్ హెచ్చరికలనేపథ్యంలో,అధికారులు అప్రమత్తంగాఉండాలని, బాపట్ల జిల్లా జాయిం ట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. చీరాల మండలం, వాడరేవు సముద్ర తీరం వద్ద పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సిహెచ్.శ్రీధర్ మాట్లాడుతూ, తుఫాన్ ప్రభావంతో, కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, మిగిలినచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశంఉందని, ఈదురు గాలులు వీస్తాయని, ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వెళ్లరాదని హెచ్చరించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ శ్రీధర్ తో పాటు, ఆర్డీవో సరోజినీ, తహసిల్దార్ జీవిగుంట ప్రభాకరరావు,అధికారులు ఉన్నారు.



## ప్రజావ్యతిరేక భూయాజమాన్య హక్కు చట్టంను రద్దు చేయాలి

**చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.రమేష్ బాబు**




చీరాల, డిసెంబర్ 04, ప్రజాపాలన : ప్రజావ్యతిరేక భూ యాజమాన్య హక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.రమేష్ బాబు డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక భూ యాజమాన్యహక్కు చట్టాన్ని రద్దు చేయాలని, న్యాయవాదులు నినాదాలు చే శారు. కార్యక్రమంలో చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.రమేష్ బాబు, పోతిన వెంకన్న చౌదరి, మేరుగ రవి కుమార్, బూదరాజు శశి కిరణ్, ఎం.అశోక్ కుమార్, తన్నీరు సురేష్, ఎం.తారక రామారావు, జి.స్నేహ, ఎం.కొండయ్య, ఆరోగ్యారావు, బెండపూడి శ్రీనివాసరావు, జి. విఠల్ రెడ్డి, విష్ణు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## జనసేనపార్టీ నేత రావూరి బాలాజీ ఆధ్వర్యంలో కాపు సేవాట్రస్ట్ సేవలు ప్రశంసనీయం.

**కాపు సేవా ట్రస్ట్ అల్పాహార విందు కార్యక్రమానికి విశేష స్పందన**

**భవన నిర్మాణకార్మికులకు అల్పాహార విందు**

**జన సైనికుల సమిష్టి కృషితో, విజయవంతమైన అల్పాహార విందు**



చీరాల, డిసెంబర్ 04, ప్రజాపాలన : జనసేన పార్టీ నేత రావూరి బాలాజీ ఆధ్వర్యంలో, కొనసాగుతున్న కాపు సేవా ట్రస్ట్ సామాజిక సేవలు ప్రశంసనీయమని, నేటి యువతకు స్ఫూర్తిదాయకమని చీరాల ప్రజలు అభినందిస్తున్నారు. స్వర్గీయ రావూరి వెంకటసుబ్బయ్య, మీనాక్షమ్మ ల జ్ఞాపకార్థం, చీరాల కాపు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో,శ్రీమతి డొక్కా సీతమ్మ, పవన్ కళ్యాణ్ ల స్ఫూర్తితో, నిరంతరం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాలలో భాగంగా,సోమవారం చీరాల ముంతావారిసెంటర్‌లో, నిర్వహించిన అల్పాహార విందు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ట్రస్ట్ వ్యవస్థాపకులు రావూరి వెంకటేశ్వర్లు, కోటేశ్వరమ్మల నిర్వహణలో, జనసేన పార్టీ నేత రావూరి బాలాజీ ఆధ్వర్యంలో, జనసైనికుల సమి ష్టి కృషితో, భవన నిర్మాణ కార్మికులకు, ప్రజలకు ఏర్పాటు చేసిన అల్పాహార విందు కార్యక్రమం విజయవంతమైంది. పెద్ద సంఖ్యలో హాజరైన భవన నిర్మాణ కార్మికులకు, ఎటువంటి ఇబ్బందులు లేకుండా, నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. కాపు సేవా ట్రస్ట్ సేవలను ప్రశంసిస్తూ, ట్రస్ట్ నిర్వాహకులను,జన సైనికులను, భవన నిర్మాణ కార్మికులు, ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రావూరి బాలాజీ, ఆలా శ్రీధర్, ఆర్ కె నాయుడు బూడిద వరం, బాసి పైడి రెడ్డి, కాటంగారి బ్రహ్మయ్య, షేక్ భాషా, వంగవల్లి భాగ్యలక్ష్మి, జి.కాళికా, కారంపూడి పద్మిని, వీర మహిళలు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎపిలో కూడ కాంగ్రెస్‌కు పూర్వవైభం

**కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి శిష్టా దత్తు**



గుడివాడ : తెలంగాణ ప్రజలను మోసం చేసిన కెసిఆర్‌కు పట్టిన గతే ఎపిలో కూడ జగన్‌మోహానరెడ్డికి వస్తుందని, రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీకి పూర్వ వైభం వచ్చే ఎన్నికల్లో చూస్తారని కాంగ్రెస్‌పార్టీ గుడివాడ నియోజవర్గ ఇన్‌చార్జి శిష్టా దత్తతేయులు అన్నారు. సోమవారం స్థానిక కిన్నెర కాంప్లెక్స్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అయన విలేకర్లుతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ జోడ్ యాత్ర ఫలితంగా తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ అధికారం సాధించిందన్నారు. దేశంలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మన రాష్ట్రంలో జగన్‌కు కూడ కెసిఆర్ ఏవిధంగా ఓటమి చెందరో అదేవిధంగా జగన్‌కూడ ఓడిపోవడం జరుగుతుందన్నారు. మన రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నరన్నారు.

# జేడీ ఎఫెక్ట్... ఎవరి పైన

విశాఖపట్టణం, డిసెంబర్ 4, :సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ మరోసారి పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఆయన విశాఖపట్నం నుంచే పార్లమెంటుకు పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. విశాఖపట్నం కేంద్రంగా ఆయన రాజకీయ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారన్నది ఇంకా స్పష్టత రాలేదు. కొత్త పార్టీ అవసరం ఉందని ఇటీవల ఆయన చేసిన ప్రకటన కొంత రాజకీయంగా చర్చనీయాం శంగా మారింది. విశాఖ పార్లమెం టు నుంచి జనసేన తరుపున ఇప్పటికే పోటీ చేసి ఓటమి పాలయిన తర్వాత ఆయన పార్టీకి గుడ్ బై చెప్పి వచ్చేశారు. స్వతంత్రంగా పార్టీ పెట్టడమా? లేక ఆమ్ ఆద్మీ వంటి పార్టీలో చేరి ఆయన అభ్యర్థిగా బరిలోకి దిగనున్నారా? అన్నది ఆసక్తి కరంగా మారింది. ఆయన టీడీపీ, వైసీపీలు కాకుండా కొత్త



పార్టీ పెట్టి అభ్యర్థిగా పోటీ చేయడానికి మాత్రం అంతా సిద్ధం చేసుకుంటున్నారు. విశాఖపట్నంలోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. అక్కడి సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానంటూ హామీ ఇస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలోనూ ఆయన వైఖరి స్పష్టంగానే ఉంది. అవసరమైతే బిడ్ వేస్తామని కూడా ఆయన ప్రకటించారు. అలా ఆయన విశాఖ నుంచే మరోసారి పోటీ చేయడానికి జేడీ లక్ష్మీనారాయణ రెడీ అవుతున్నారు. ఈసారి జనసేన, టీడీపీ పొత్తు ఖరారు కావడంతో ఆయన కొత్త పార్టీ నుంచే అభ్యర్థిగానే పోటీ చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే ఆయన పోటీలో ఉంటే ఎవరికి నష్టమన్న లెక్కలు రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే వేసుకుంటుండటం విశేషం. జేడీ లక్ష్మీనారాయణకు సొంత ఇమేజ్ ఉంది. ఆయనకంటూ కొంత ఓటు బ్యాంకు సహజంగానే ఉంటుంది. నిజాయితీ కలిగిన అధికారిగా పేరుండటమే కాకుండా, సామాజికవర్గం పరంగా కూడా కొంత కలసి వచ్చే అంశమే. పైగా విశాఖ వంటి నగరంలో అన్ని రాష్ట్రాలకు చెందిన ఓటర్లు ఉండటం కూడా జేడీకి కలసి వచ్చే అంశంగానే పరిగణిస్తున్నారు. గత ఎన్నికల్లో జేడీ వల్లనే టీడీపీ అభ్యర్థి భరత్ తక్కువ ఓట్లతో ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన పురంద్రీశ్వరికి 34 వేలు ఓట్లు రాగా, జనసేన తరుపున బరిలో నిలిచిన జేడీ లక్ష్మీ నారాయణకు 2.88 లక్షల ఓట్లు వచ్చాయి. కొంత పార్టీ, మరికొంత వ్యక్తిగత ఇమేజ్‌తోనే ఆయనకు ఆ స్థాయి ఓట్లు వచ్చాయి. ఇప్పుడు జనసేన, టీడీపీ అభ్యర్థి బరిలో ఉన్నప్పటికీ, జేడీ స్వత్రంత అభ్యర్థిగా పోటీ చేస్తే ఆ కూటమికే నష్టమన్న అంచనాలు వినిపిస్తున్నాయి. జనసేన ఓట్లన్నీ జేడీకే పడతాయన్న టాక్ బలంగా వినపడుతుంది. దీంతో పాటు ప్రభుత్వ వ్యతిరేక ఓటు కూడా లక్ష్మీనారాయణ సొంతం చేసుకునే అవకాశముంది. అందువల్ల జేడీకి వచ్చే ప్రతి ఓటు టీడీపీ, జనసేన కూటమికి పడేవేవన్న లెక్కలు బాగా వినపడుతున్నాయి. అందుకే టీడీపీ జేడీని పార్టీలోకి ఆహ్వానించేందుకు సిద్ధమయిందని మొన్నటి వరకూ వార్తలు హల్ చల్ చేశాయి. కానీ దానిపై జేడీ క్లారిటీ ఇచ్చేశారు. ఆయన కొత్త పార్టీ ఎప్పుడు పెడతారు? ఏ పార్టీ అన్నది ఇప్పుడు పొలిటికల్‌గా హాట్ టాపిక్ అయింది.

## వైవీ.. దారెటు...?



ఒంగోలు, డిసెంబర్ 4, :వైసీపీ కీలక నేత వైవి సుబ్బారెడ్డి విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్నారా? హై కమాండ్ ఆదేశించిందా? ఆయన అయిష్టంగానే ఒప్పుకున్నారా? పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. మొన్నటి వరకు టీటీడీ చైర్మన్ గా ఉన్న వై వి సుబ్బారెడ్డి ఇప్పుడు ఉత్తరాంధ్ర వైసీపీ ఇన్చార్జి గా ఉన్నారు. టీటీడీ అధ్యక్ష పీఠంతో పాటు ఉత్తరాంధ్ర సమన్వయ బాధ్యతలను చూసుకుంటూ వచ్చారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటంతో టీటీడీ పదవిలోకి కరుణాకర్ రెడ్డిని కూర్చోబెట్టారు. వైవి సుబ్బారెడ్డి ని ఉత్తరాంధ్ర ఇన్చార్జిగానే పరిమితం చేశారు. ఇదే సమయంలో తాను వచ్చే ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేస్తానని వై వి ప్రకటించడంతో రకరకాల ఊహాగానాలు ప్రారంభమయ్యాయి.వైవి సుబ్బారెడ్డి సీఎం జగన్ కు సమీప బంధువు. బాబాయ్ అవుతారు. వైసీపీ ఆవిర్భావం తర్వాత జగన్ వెంట నడిచారు. 2014 ఎన్నికల్లో వైసీపీ తరఫున ఒంగోలు ఎంపీ గా పోటీ చేసి విజయం సాధించారు.అయితే 2019 ఎన్నికల్లో మాత్రం పోటీ చేయలేదు. ఆయన స్థానంలో టిడిపి నుంచి వైసీపీలో చేరిన మాగుంట శ్రీనివాసులు రెడ్డి పోటీ చేశారు. వైసీపీ అధికారంలోకి రావడంతో వై వి సుబ్బారెడ్డికి టీటీడీ అధ్యక్ష పీఠం దక్కింది. నాలుగు సంవత్సరాలు ఆ పదవిలో ఉన్న వై వి సుబ్బారెడ్డిని ఈసారి విశాఖ ఎంపీగా పోటీ చేయించాలని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. అయితే రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైవి సుబ్బారెడ్డి పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.వైవి సుబ్బారెడ్డి చూపు ఒంగోలు ఎంపీ స్థానం పై ఉంది. అక్కడ నుంచి మరోసారి పోటీ చేయాలని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. అయితే దీనిపై మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి, పార్టీ కీలక నేత విజయసాయిరెడ్డి అడ్డుపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం వైసీపీలో వై వి సుబ్బారెడ్డి, బాలినేని శ్రీనివాస్ రెడ్డి ప్రత్యర్థులుగా మారిపోయారు. ఒకరిపై ఒకరు పై చేయి సాధించాలని చూస్తున్నారు. అయితే హై కమాండ్ మాత్రం వై వి సుబ్బారెడ్డికి పెద్దపీట వేస్తోంది. ఇది బాలినేనికి మింగుడు పడడం లేదు. మరోవైపు ఉమ్మడి ప్రకాశం జిల్లా ఇన్చార్జిగా విజయసాయిరెడ్డి ఉన్నారు. ఆయన సైతం వై వి సుబ్బారెడ్డి వైఖరిని వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. కానీ ఎట్టి పరిస్థితుల్లో తాను ఒంగోలు నుంచి పోటీ చేస్తానని వై వి సుబ్బారెడ్డి తన అనుచరుల వద్ద చెబుతున్నట్లు తెలుస్తోందిమరోవైపు సిట్టింగ్ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మరోసారి ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. తాను కాకుంటే కుమారుడు రాఘవరెడ్డిని నిలబెట్టాలని చూస్తున్నారు. బాలినేని తో పాటు విజయసాయిరెడ్డి సైతం మాగుంట వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే మాగుంట కుటుంబం పై కేసులు నమోదయ్యాయి. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో ఆయన కుమారుడు అరెస్ట్ అయ్యారు కూడా. ఈ తరుణంలో మాగుంట కుటుంబానికి జగన్ టికెట్ ఇస్తారా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది. ఒంగోలులో వైవి సుబ్బారెడ్డి ఎంట్రీ అయితే పార్టీకి బాలినేని తో పాటు మా గుంట దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందుకే జగన్ వైవి సుబ్బారెడ్డిని విశాఖ నుంచి పోటీ చేయాలని సూచిస్తున్నారు. కానీ ఎట్టి పరిస్థితుల్లో ప్రకాశం జిల్లా రాజకీయాల నుంచి వెళ్లే ఉద్దేశం తనకు లేదని వైవి సుబ్బారెడ్డి సంకేతాలు ఇస్తున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## ఏపీలో దంచికొడుతున్న వానలు..



విశాఖపట్టణం, డిసెంబర్ 4, :బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం సోమవారం ఉదయానికి తుఫానుగా మారనుంది. ఈ క్రమంలో ప్రకాశం జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. వచ్చే 4 రోజులపాటు వర్షాలు ముమ్మరంగా కురిసే అవకాశం ఉన్నట్లు ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీంతో సోమ, మంగళవారాల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. తుపాను తీరం దాటే సమయంలో గాలి ఉధృతంగా వీస్తుందని హెచ్చరించారు. గంటకు 95 నుంచి 105 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు అన్ని శాఖల సిబ్బంది, సచివాలయ సిబ్బంది జిల్లా ప్రజలకు అందుబాటులో వుండాలని జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్ సూచించారు. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర తుఫానుగా మారిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికార యంత్రాంగాన్ని ఆయన అలర్ట్ చేశారు.'మైచౌంగ్' తుఫానుగా నామకరణం చేశారు. తుఫాను ఈ నెల 4న నెల్లూరు ? మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. దీంతో అధికారులంతా సన్నద్ధంగా వుండాలని, సహాయక చర్యల్లో ఎలాంటి లోటూ రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కరెంట్, రవాణా వ్యవస్థలకు అంతరాయం ఏర్పడితే వాటిని వెంటనే పునరుద్ధరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ సూచించారు. తుఫాను ప్రభావిత ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సహాయ శిబిరాలను ఏర్పాటు చేసి, అందులో తాగునీరు, ఆహారం, పాలు వంటివి అందుబాటులో వుంచుకోవాలని సూచించారు. అలాగే వైద్య సేవలను కూడా అందజేపయాలని తెలిపారు.అటు మైచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో రైల్వే శాఖ పెద్ద సంఖ్యలో రైళ్లను రద్దు చేసింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 140కి పైగా రైళ్లను డిసెంబర్ 3 నుంచి 6 వ తేదీ వరకు రద్దు చేసినట్లు సీపీఆర్వో సీహెచ్ రాకేష్ తెలిపారు. మరికొన్నింటినీ పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఇప్పటికే నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో వర్షాలు మొదలయ్యాయి. రహదారులన్నీ జలమయం అయ్యాయి. నెల్లూరు జిల్లా మైపాడు బీచ్‌లో అలలు ఎగసిపడుతున్నాయి.

## బిజెపిని ఎపిలో మరింత బలోపేతం చేస్తాం

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు**



గుడివాడ : దేశంలో ప్రతి ఒక్కరికి సమన్యాయం చేస్తున్న ప్రదాని నరేంద్రమోడి పాలనకు నిన్న జరిగిన 4రాష్ట్రాల ఫలితాలు తేటతేలం చేస్తున్నాయి, త్వరలో ఎపిలో జరిగే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వనికి కూడ ప్రజలు తిరస్కరించి బిజెపికి పట్టాం కడతారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు రామినేని వెంకటకృష్ణ, గుత్తికొండ శ్రీరాజబాబులు అన్నారు. సోమవారం స్థానిక బిజెపి కార్యాలయంలో 3రాష్ట్రలలో బిజెపి విజయకేతం ఏగరవేసి తెలంగాణలో గతంలో 1ఎమ్మెల్యే సీటును నేడు 8 ఎమ్మెల్యేలను గెలిపించినందుకు సంబారాలు చేసుకుని మిఠయిలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా రామినేని, గుత్తికొండలు మాట్లాడుతూ నిన్న జరిగిన 4రాష్ట్రల ఫలితాలలో 147 మంది బిజెపి ఎమ్మెల్యేలు గెలపుపొందడం జరిగిందన్నారు. మధ్యప్రదేశ్, ఛతీస్‌గడ్, రాజస్థానలో బిజెపి విజయదుందభి మోగించిందన్నారు. తెలంగాణలో గతంలో 1సీటు మాత్రమే ఉన్న బిజెపి నేడు 8 సీట్లు సాధించి ప్రజల మన్ననలు పొందిందన్నారు. మన రాష్ట్రంలో దుష్టా పాలనకు త్వరలోనే ప్రజలు స్వష్టి చేపి బిజెపిని గెలిపిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, పట్టణాధ్యక్షుడు యర్రబోతు అర్జున్, నాయకులు సూరే గాంధీ, పల్లపోతు మురళీ, రాంప్రసాద్, కొత్త కిరణ్, మాదాసు సత్యనారాయణ, ఆంజనేయులు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఫెన్షనర్ల పార్టీ వెనుక ఎల్వీ...



విజయవాడ, డిసెంబర్ 4, : ఏపీ ప్రభుత్వ మాజీ సిఎస్ ఎల్ వి సుబ్రహ్మణ్యం జగన్ సర్కార్ పై యుద్ధం ప్రకటించారు. ఏపీలో విశ్రాంత ఉద్యోగులు విషయంలో సర్కార్ వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా పోరాటానికి సిద్ధపడ్డారు. 2019 ఎన్నికల నాటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఎల్వి సుబ్రహ్మణ్యం ఉండేవారు. కానీ జగన్ కు ఆయన కొనసాగింపు ఇచ్చారు. ఎనలేని ప్రాధాన్యమిచ్చారు. సుబ్రహ్మణ్యం సైతం సీఎం జగన్ అంటే ఎనలేని అభిమానంతో ఉండేవారు. అయితే వారి మధ్య ఎక్కడ తేడా కొట్టిందో కానీ పదవి విరమణకు ముందు అప్రాధాన్య పోస్టులోకి పంపించారు. దీంతో అవమానంగా భావించిన ఎల్.వి చివరి వరకు సెలవు పెట్టి పదవి విరమణ చేశారు. ఇప్పుడు అదే ఎల్వి సుబ్రహ్మణ్యం జగన్ సర్కారుకు కొరకరాని కొయ్యగా మారారు. ఏకంగా పెన్షనర్లతో ఓ పార్టీ పెట్టించి పోరాటానికి దిగడం విశేషం. టిడిపి ప్రభుత్వ హయాంలో ఐవైఆర్ కృష్ణారావు ఒక వెలుగు వెలిగారు. ఆయన సీఎస్ గా పని చేశారు. పదవీ విరమణ తర్వాత చంద్రబాబు ఆయన్ను బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించారు. కానీ 2019 ఎన్నికలకు ముందు టిడిపికి వ్యతిరేకంగా కామెంట్స్ చేశారు. జగన్కు రాజకీయ లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారు. 2019 ఎన్నికల తర్వాత ఐ వై ఆర్ కృష్ణారావు బిజెపిలో చేరారు. అయితే గతం మాదిరిగా జగన్ సర్కార్ పై ఎటువంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదు కానీ.. కొన్ని రకాలుగా విమర్శనాస్త్రాలు సంధించారు. వైఫల్యాలను అండగట్టారు. సరిగ్గా ఐవైఆర్ మాదిరిగానే ఎల్వి సుబ్రహ్మణ్యం ఇప్పుడు జగన్ సర్కారును ఇరుకున పెట్టేలా వ్యవహరిస్తున్నారు.ప్రతి నెల పెన్షనర్లు పింఛన్ కోసం ఎదురుచూడాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏపీలో ఉంది. మూడో వారం దాటితే కానీ పెన్షన్ దొరకని పరిస్థితి. ఈ తరుణంలో ఆంధ్ర ప్రదేశ్ పెన్షనర్స్ పార్టీ ఏర్పాటుచేసి కొంతమంది పోరాడుతున్నారు. దీనికి ముందుండి నడిపించేందుకు ఎల్వి సుబ్రహ్మణ్యం ముందుకు రావడం విశేషం. విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులో పెన్షనర్ల హక్కుల కోసం రాజకీయ పార్టీ పెట్టి పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని ఎల్.వి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజ్యాంగం అమలు చేసే వ్యక్తులు సరైన వాళ్ళు అయితే అందరి హక్కులకు రక్షణ ఉంటుందని చెప్పారు. వ్యవస్థలు సక్రమంగా నడిచినప్పుడు వ్యక్తుల స్వాతంత్రం కాపాడ పడుతుందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం పెన్షనర్లను దారుణంగా వంచిస్తుందన్నారు. దీనికి మూల్యం తప్పదని హెచ్చరించారు. మొత్తానికైతే ఎన్నికల ముంగిట మాజీ సిఎస్ ఎల్వి సుబ్రహ్మణ్యం బయటకు వచ్చి జగన్ సర్కార్ పై పోరాడుతుండడం విశేషం.



## 'వార్ 2' కోసం మార్చి నుంచి ఎన్టీఆర్.. ?



మోస్ట్ వాంటెడ్ పాన్ ఇండియా మల్టీస్టారర్స్ లో 'వార్ 2' ఫస్ట్ ప్లేస్ లో ఉంటుంది. ఎన్టీఆర్ హృతిక్ రోషన్ కలయికలో రాబోతున్న ఈ సినిమా షూటింగ్ పై ఇప్పుడు మరో క్రేజీ న్యూస్ వినిపిస్తోంది. ఈ సినిమా కోసం మార్చి నుంచి ఎన్టీఆర్ డేట్స్ ఇచ్చాడని తెలుస్తోంది. మార్చి మొదటి వారానికి 'దేవర' షూటింగ్ పూర్తి అవుతుందని.. అనంతరం ఓ వారం విశ్రాంతి తర్వాత మార్చి రెండో వారం నుంచి తారక్ 'వార్ 2' ప్రాజెక్ట్ కోసం డేట్స్ కేటాయించాడని తెలుస్తోంది. ముందుగా ఎన్టీఆర్ హృతిక్ రోషన్ ల పై ఓ యాక్షన్ సీక్వెన్స్ ను షూట్ చేస్తారని టాక్ నడుస్తోంది. మరి ఎన్టీఆర్ హృతిక్ రోషన్ కాంబినేషన్ అంటే.. బాక్సాఫీస్ షేక్ అయినట్టే.ఇక ఈ సినిమాలో ఎన్టీఆర్ పాత్ర పై ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే. ఇక వార్ 2 కథ విషయానికి వస్తే.. హృతిక్ రోషన్ పాత్రకు దీటుగా ఎన్టీఆర్ పాత్ర ఉంటుందట. ఇది ఇద్దరి స్నేహితుల కథ అని, అర్జునుడు కృష్ణుడు లా కలిసి ఉన్న ఇద్దరు స్నేహితులు.. చివరకు శత్రువులు గా మారితే ఎలా ఉంటుంది ? అనే కోణంలో ఈ సినిమా సాగుతుందట. ఏది ఏమైనా వార్ 2 అనేది యాక్షన్ ఫిల్మ్. మరి యాక్షన్ ఫిల్మ్ లో ఎన్టీఆర్ ఏ రేంజ్ నటనతో ఆకట్టుకుంటాడో చూడాలి. నిర్మాత ఆదిత్య చోప్రా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## యష్19 టైటిల్ రివీల్ కి డేట్ ఫిక్స్!




కేజీఎఫ్ సిరీస్ చిత్రాలతో ఆడియెన్స్ ను అలరించిన కన్నడ హీరో యష్, తన నెక్స్ట్ సినిమా గురించి వెల్లడించడానికి రెడీ అయ్యారు. కేజీఎఫ్ 2 సినిమా తర్వాత చాలా గ్యాప్ తీసుకున్న యష్, తన 19 వ సినిమా కి సంబందించిన అప్డేట్ ను రివీల్ చేశారు. ఈ సినిమాకి సంబందించిన టైటిల్ ను అనౌన్స్ చేయడానికి డేట్ అండ్ టైమ్ ఫిక్స్ చేసుకున్నాడు.తాజా అప్డేట్ ప్రకారం యష్ 19 టైటిల్ ప్రకటన డిసెంబర్ 8, 2023 ఉదయం 9:55 గంటలకు రివీల్ కానుంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను కెవిఎన్ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్నారు. గీతూ మోహన్‌దాస్ ఈ సినిమాకి దర్శకత్వం వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఈ సినిమా కి సంబందించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

## లపాలిటిక్స్.. సురేఖవాణిపై ట్రోల్స్ ఎందుకు?



టాలీవుడ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ సురేఖ వాణి గురించి తెలిసిందే. అగ్ర హీరోల సినిమాల్లో అక్క, అమ్మ, వదిన పాత్రలలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇక ఈ మధ్యకాలంలో సినిమాలు కంటే కూడా సోషల్ మీడియాతోనే ఎక్కువ పాపులారిటీని సంపాదించుకుంది. ఈ వయసు లోనూ యువ హీరోయిన్లకు దీటుగా సోషల్ మీడియాలో రచ్చ చేస్తుంటుంది సురేఖ వాణి. ఆమెనే అనుకుంటే ఆమె కూతురు నెక్స్ట్ లెవెల్ లో రచ్చ చేస్తూ సోషల్ మీడియా హాట్ బ్యూటీగా పేరు తెచ్చుకుంది. అలా ఈ తల్లీ కూతుళ్లు నిత్యం సోషల్ మీడియాలో హాట్ ఫొటోస్ పెడుతూ చర్చనీయాంశం అవుతుంటారు. ఇక తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడంతో ఆ వీడియోని డిలీట్ చేసి కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి తో ఉన్న ఫోటోను తన స్టోరీగా పెట్టి శుభాకాంక్షలు తెలిపింది. ఈ ఫోటో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ గా మారింది. ఈ ఫోటోని చూసిన నెటిజన్స్ ఈ తల్లి కూతుళ్ళపై రకరకాల కామెంట్స్ తో సోషల్ మీడియా అంతటా ట్రోల్ చేస్తున్నారు. ఇందులో చాలామంది 'ఈ తల్లి కూతుర్లు ప్లేట్ ఫిరాయించారంటూ' కామెంట్స్ చేశారు. అయితే ఈసారి కొంతమంది నెటిజన్స్ ఈ తల్లి కూతుర్లకు సపోర్టుగా నిలిచారు. "ఈ విషయంలో వాళ్ళని ట్రోల్ చేయడం కరెక్ట్ కాదని, ఎవరైనా రూలింగ్ పార్టీకే సపోర్ట్ చేయాలని అనుకుంటారు. కాబట్టి అందులో తప్పేముంది" అని కొంతమంది అంటుంటే. "ఏ పార్టీ అధికారంలోకి రావాలనేది అది పూర్తిగా ప్రజల నిర్ణయం. ఆ తల్లి కూతుర్ల స్థానంలో ఎవరున్నా గెలిచిన పార్టీకే సపోర్ట్ చేస్తారు. దాన్ని ఇంత రచ్చ చేయడం అవసరమా?"అంటూ మరికొందరు.." గెలిచిన పార్టీకి సపోర్ట్ చేయడం అనేది అందరూ చేసే పనే. అది చాలా సర్వసాధారణం" అంటూ ఇంకొందరు ఈ తల్లి కూతుర్లకు సపోర్ట్ చేస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తపంస్తున్నారు.

## ఎన్టీఆర్ తర్వాత చరణ్ తో ఆమె...!



అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ హీరోయిన్ గా బాలీవుడ్ లో అడుగు పెట్టి చాలా కాలం అయింది. అక్కడ ఆశించిన స్థాయిలో సక్సెస్ లు దక్కలేదు. అయినా కూడా స్టార్ కిడ్ అవ్వడంతో ఆఫర్లు వచ్చాయి.. ఇంకా వస్తూనే ఉన్నాయి. అయితే టాలీవుడ్ లో ఈ అమ్మడి క్రేజ్ మామూలుగా లేదు. దేవర రెండు పార్ట్ లు గా రాబోతున్న విషయం తెల్సిందే. రెండు పార్ట్ ల్లో కూడా జాన్వీ కపూర్ పాత్ర చాలా కీలకంగా ఉంటుంది అంటూ మేకర్స్ బలంగా చెబుతున్నారు. దేవర తో పాటు జాన్వీ మరే తెలుగు సినిమాను చేయడం లేదు.అక్కడ మంచి విజయాలు సొంతం చేసుకోవాలనే కోరిక ఆమెకు స్ట్రాంగ్ గా ఉంది. అందుకే ఇప్పటి వరకు మరే తెలుగు సినిమాకు కమిట్ అవ్వలేదు అంటూ ఇన్ని రోజులు ప్రచారం జరిగింది. తాజాగా రామ్ చరణ్ కి జోడీగా జాన్వీ కపూర్ నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది అంటూ వార్తలు వస్తున్నాయి. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం బుచ్చి బాబు ఇప్పటికే జాన్వీ కపూర్ తో చర్చలు జరిపాడని.. దేవర సినిమా తర్వాత రామ్ చరణ్ తో కలిసి నటించేందుకు జాన్వీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. రామ్ చరణ్ వంటి పాన్ ఇండియా స్టార్ సినిమాలో నటించేందుకు బాలీవుడ్ స్టార్ ముద్దుగుమ్మలు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. జాన్వీ కపూర్ ఈ సినిమాతో బాలీవుడ్ లో గుర్తింపు దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో ఓకే చెప్పిందని టాక్ వినిపిస్తోంది. మొత్తానికి ఎన్టీఆర్ దేవర సినిమా తర్వాత జాన్వీ కపూర్ తెలుగు లో రామ్ చరణ్ కి జోడీగా నటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ విషయమై స్పష్టత రావాల్సి ఉంది. ఒక వేళ చరణ్ కి జోడీగా జాన్వీ నటిస్తే కచ్చితంగా సూపర్ గా ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ఉంటుందని ఫ్యాన్స్ నమ్ముతున్నారు.

## హీరోయిన్ లవ్ లెటర్, ఆమె భర్త చేతికి...!




స్టార్ హీరోలు చిరంజీవి మొదలుకుని ఎన్టీఆర్, మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ లతో పాటు పలువురు స్టార్ హీరోలతో నటించి మెప్పించిన ముద్దుగుమ్మ భూమిక. ఒకప్పుడు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా కొనసాగిన భూమిక ఈ మధ్య కాలంలో సైలెంట్ అయింది.హీరోయిన్ గా ఆమె ప్రస్థానం ముగించి క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా కొనసాగుతోంది.యంగ్ హీరోల సినిమాల్లో ముఖ్య పాత్రల్లో నటిస్తూ దూసుకు పోతున్న భూమిక సోషల్ మీడియా ద్వారా రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంది. జాతరే జాతర తాజాగా ఈ అమ్మడు తనకు వచ్చిన ఒక లవ్ లెటర్ ను షేర్ చేసింది. ఒక అభిమాని నాకు లవ్ లెటర్ రాశాడు. అయితే అది నాకు పంపించకుండా నా భర్తకు పంపించాడు అంటూ ఆ లెటర్ ను భూమిక సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది. ఆ లెటర్ లో సదరు అభిమాని భూమిక పై ఉన్న అభిమానంను చూపించడంతో పాటు ప్రేమను చూపించే ప్రయత్నం చేశాడు. ఎవరైనా ప్రేమిస్తే డైరెక్ట్ గా ప్రేమ లేఖలు ఇస్తారు. కానీ ఇలా వారి జీవిత భాగస్వామికి పంపించడం ఏంట్రా బాబు అంటూ కొందరు నెటిజన్స్ సదరు భూమిక అభిమాని గురించి కామెంట్స్ చేస్తున్నారు. ఏదో ఒక విధంగా భూమిక దృష్టిలో పడ్డ ఆ అభిమాని లక్కీ అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. 2007 సంవత్సరంలో భరత్ ఠాకూర్ ని పెళ్లి చేసుకున్న భూమిక సంసార జీవితం పై అనేక పుకార్లు షికార్లు చేశాయి. ఆ మధ్య భరత్ ఠాకూర్ మరో అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు అనే ప్రచారం కూడా జరిగింది. అంతా పుకార్లే... భూమిక మరియు భరత్ ఠాకూర్ లు కలిసే ఉన్నారు అనేందుకు తాజాగా ఈ పోస్ట్ లు నిదర్శనం అంటూ కొ ందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## నా సామి రంగ.. వరలక్ష్మి అందంకు నాగ్ ఫిదా




అక్కినేని నాగార్జున నుంచి రాబోతున్న మాస్ ఫ్యామిలీ డ్రామా నా సామి రంగా సినిమా సంక్రాంతి నీ టార్గెట్ చేసిన విషయం తెలిసిందే. నాగార్జున గతంలో సోగ్గాడే చిన్నినాయన బంగార్రాజు లాంటి సినిమాలతో సంక్రాంతికి మంచి సక్సెస్ లను సొంతం చేసుకున్నాడు. ఇక ఇప్పుడు కూడా అదే సెంటిమెంట్ తో నా సామీ రంగ సినిమాను రంగంలోకి దింపబోతున్నాడు. అయితే అందులో ఎలాంటి నిజం లేదు అని సంక్రాంతిని టార్గెట్ చేస్తూ ఈ సినిమా పోటీలో ఉండబోతోంది అని క్లారిటీ వచ్చేసింది. ఇక సినిమాకు సంబంధించిన అప్డేట్స్ తో పాజిటివ్ వైబ్రేషన్స్ క్రియేట్ అయ్యేలా అడుగులు వేస్తూ ఉన్నారు. మొదటి పాటను విడుదల చేయబోతున్నట్లు ఒక స్పెషల్ వీడియో కూడా విడుదల చేశారు. ఈ సినిమాలో నాగార్జునకు జోడిగా ఆశికా రంగనాథ్ కనిపించబోతోంది. అయితే ఆమెకు సంబంధించిన ప్రోమో ద్వారా సాంగ్ అప్డేట్ అయితే ఇచ్చారు. ఆ వీడియోలో వరలక్ష్మీ పాత్రలో ఆశిక అద్దంలో చూసుకుంటూ చాలా సిగ్గుపడుతూ ఉంటుంది. ఇక తర్వాత గోడ దగ్గర నుంచి నాగార్జున వరలక్ష్మి నీ రొమాంటిక్ ఫీల్ తో చూస్తూ కనిపిస్తున్నాడు. ఇద్దరి మధ్యలో ఉండే ఆ ప్రేమ సన్నివేశాలు హైలైట్ గా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఎత్తుకుపోవాలని అనిపిస్తుంది అనే ఈ పాటను త్వరలోనే విడుదల చేయబోతున్నట్లుగా ఈ వీడియోలో తెలియజేశారు.ఈసారి నాగార్జునతో ఫ్యామిలీ ఆడియెన్స్ తో పాటు యువతను కూడా మాస్ ఎలివెంట్స్ తో ఆకట్టుకోబోతున్నట్లు తెలుస్తోంది ఈ తరహా లో నాగార్జున చేసిన ప్రయోగాలు సంక్రాంతికి మంచి సక్సెస్ అయ్యాయి. మరి నా సామిరంగా సినిమా ఎలాంటి రికార్డులను క్రియేట్ చేస్తుందో చూడాలి. ఈ సినిమాలకు బిన్నీ విజయ్ దర్శకత్వం వహిస్తుండగా శ్రీనివాస సిల్వర్ స్క్రీన్స్ నిర్మిస్తోంది. అలాగే ఈ సినిమాలో అల్లరి నరేష్ రాజ్ తరుణ్ కూడా ప్రత్యేకమైన పాత్రలలో కనిపించబోతున్నారు.

## యానిమల్ పై త్రిష పోస్ట్ వైరల్



దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణబీర్ కపూర్ లాంటి టాలెంటెడ్ హీరో కలయికలో వచ్చిన సినిమా యానిమల్. ఈ మూవీ ప్రస్తుతం థియేటర్లలో దూసుకుపోతోంది. ఐతే, ఈ యానిమల్ సినిమాలో స్త్రీలను తక్కువగా చూపించారంటూ కొంతమంది నెటిజన్లు నెగిటివ్ కామెంట్స్ తో విరుచుకుపడుతున్నారు. ఈ నేపథ్యంలో హీరోయిన్ త్రిష యానిమల్ సినిమా 'ఒకటే పదం-కల్ట్' అంటూ తన ఇన్‌స్టా లో పోస్ట్ పెట్టింది. దీంతో, త్రిష పోస్టు పైనా విమర్శలు వెల్లువెత్తున్నాయి.వారం క్రితమే మహిళల గౌరవం గురించి మాట్లాడి, ఇప్పుడు యానిమల్ సినిమాను పొగుడుతున్నారా అంటూ పలువురు నెటిజన్లు త్రిష ను ఎద్దేవా చేస్తూ పోస్ట్ లు పెడుతున్నారు. ఈ నెగిటివ్ కామెంట్స్ చూసిన త్రిష, ఆ వెంటనే తన పోస్ట్ ను తొలగించింది. ప్రస్తుతం ఇది నెట్టింట చర్చనీయాంశంగా మారింది. ఇక ఈ యానిమల్ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబడుతుండగా.. కేవలం రెండు రోజుల్లోనే రూ. 236 కోట్లు వచ్చినట్లు మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.



Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16. and SREE SESHASAI ENTERPRISES "D.NO : 3-88, "C/O CHANDRA THEATER," GOSALA VILLAGE, "MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com
PIN: 521151."MOBILE :9912333140 Email : sreeseshasaivja@gmail.com.